ఈనాడు
అమరావతి
గుంటూరు
మంగళవారం సెప్టెంబరు 1, 2026

స్కానింగ్ పేరుతో స్కామ్

- జీజీహెచ్ ఎంఆర్ఐ విభాగంలో మాయాజాలం
- లెక్కల్లో రోజుకు వంద నుంచి 120
- సెలవు రోజుల్లోనూ ఇవే గణాంకాలు

సాధారణంగా ఒక ఎంఆర్ఐ స్కానింగ్‌కు పట్టే సమయం...

- మెదడు, తలకైతే 20 నుంచి 45 నిమిషాలు.. అదే మోకాలిచిప్ప, భుజం అయితే 15 నుంచి 30... వెన్నెముకకు 20 నుంచి 45.. పొట్ట, కటి భాగమైతే 30 నుంచి 60 నిమిషాలు...
- ఒక్కో స్కానింగ్‌కు సరాసరి 30 నిమిషాల సమయం తీసుకున్నా.. రోజులో యంత్రాన్ని ఆపకుండా, సిబ్బంది నిరంతరాయంగా చేసినా గరిష్ఠంగా తీసే స్కాన్‌లు 48...
- మరి గుంటూరు జీజీహెచ్‌లోని ఎంఆర్ఐ విభాగం రోజుకు ఎన్ని చేస్తోందో తెలుసా...
- అక్షరాలా 110 నుంచి 120... అదీ ఒకే యంత్రంపై రద్దీ రోజుల్లేనే కాదు.. శని, ఆదివారాల్లోనూ ఈ సంఖ్య తగ్గడం లేదు.
- చివరకు జూడాల సమ్మెతో వార్డులు వెలవెలబోయినా.. ఇక్కడ మాత్రం రద్దీ కొనసాగిందంటూ లెక్కలు చూపుతున్నారు.

ఈనాడు-అమరావతి

ఆగస్టులో ఇలా..

తేదీ	స్కానింగ్‌లు
10	129
11	127
12	116
13	121
14	107
15	107
16	122
17	120
18	123
19	114

దోచి పెట్టేవాళ్లు మన వాళ్లైతే ఏం చేసినా.. ఎలా రాసేసినా చెల్లిపోతుందనడానికి జీజీహెచ్‌లో పీపీపీ విధానంలో సేవలందిస్తున్న ఎంఆర్ఐ విభాగమే నిదర్శనం. రోజువారీ స్కానింగ్‌ల లెక్కలు ముక్కున వేలేసుకునేలా ఉంటున్నాయి. ఈ మాయాజాలంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అవసరం లేకున్నా వైద్యులు అడ్డదిడ్డంగా ఎంఆర్ఐకు రెఫర్ చేస్తున్నారా? ప్రైవేట్ రోగులకూ ఇక్కడే స్కానింగ్ చేస్తున్నారా? లేక నిర్వాహకులే కాకి లెక్కలతో కథ నడిపిస్తున్నారా? తేలాల్సి ఉంది. ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లలో ఒక్కో స్కానింగ్‌కు రూ.7 వేల నుంచి రూ.10 వేలకు వరకు వసూలు చేస్తుండడంతో జీజీహెచ్‌కు సిఫార్సులు పెరుగుతున్నాయన్న వాదన బలంగా ఉంది.

సంవత్సరం	అడ్మిషన్లు	ఎంఆర్ఐలు
2020	51,107	12,120
2021	73,283	33,821
2022	71,398	34,075
2023	70,933	33,050
2024	63,777	36,705
2025	81,718	41,370
2026 (జూన్ 30)	31,221	20,358

విజిలెన్స్ విచారణ చేస్తేనే...

ఈ లెక్కలపై అధికారులు ప్రశ్నించకపోవడం గమనార్హం. రూ.కోట్ల చెల్లింపులపై విజిలెన్స్ విచారణ చేస్తే వాస్తవాలు వెలుగులోకొస్తాయి. జీజీహెచ్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్‌ను 'ఈనాడు' వివరణ కోరగా.. విచారణ చేపడతామని చెప్పారు.

ఏడేళ్లుగా ఇదే పరిస్థితి..

ఏడేళ్లుగా జీజీహెచ్‌లో మొత్తం రోగుల అడ్మిషన్లు, ఏటా తీసిన ఎంఆర్ఐ వివరాలను 'ఈనాడు' సేకరించింది. ఇందులో గణాంకాలు విశ్లేషిస్తే విస్తుపోయే విషయాలు వెలుగు చూశాయి. మొత్తం అడ్మిషన్లలో 40 శాతంమందికిపైగానే ఎంఆర్ఐ చేసినట్టుగా గణాంకాలు చెబుతున్నాయి. వీటి ఆధారంగానే చెల్లింపులు చేస్తుండడంతో భారీ మొత్తంలో ప్రభుత్వ ధనం వృధా అవుతోంది.

సీఆర్ఐవైఎన్ నిర్మాణానికి రూ.9.94 కోట్ల మంజూరు

ఈనాడు, అమరావతి: ప్రత్తిపాడు మండలం నడింపాలెంలో 'సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ యోగా అండ్ నేచురోపతి (సీఆర్ఐవైఎన్)' నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని సేకరించేందుకు, ఇతర పనులకు ప్రభుత్వం రూ.9.94 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ సోమవారం ఉత్తర్వులు వెలువరించింది. భూసేకరణ, వరద నీటి కాలువ నిర్మాణానికి రూ.6.74 కోట్లు, స్థలం చదునుకు రూ.3.20 కోట్లు వెచ్చించనుంది. మొత్తమ్మీద ఈ ప్రాజెక్టుకు రూ.100 కోట్లు కేటాయించనుంది.

ఉద్యోగ మేళాలో 24 మందికి కొలువులు

చేబ్రోలు, న్యూస్‌టుడే: నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 24 మంది కొలువులు సాధించారని ప్లేస్‌మెంట్ అధికారి రవికుమార్ తెలిపారు. టాటా ఎలక్ట్రానిక్స్, హెచ్ఎస్ఎన్ టెక్ సొల్యూషన్స్, ఎస్‌బీఐ కార్డ్స్ వంటి 10 సంస్థల ప్రతినిధులు పాల్గొనగా 82 మంది నిరుద్యోగులు హాజరయ్యారన్నారు. కొలువులు సాధించిన వారికి నియామక పత్రాలు అందజేశారు.

కాపలాదారుల కక్కుర్తి

పెద్ద ఆలయాల్లోనూ సొమ్ము పక్కదారి

డీసీ, ఏసీ, గ్రేడ్-1 ఈవో పర్యవేక్షణలోనూ అక్రమాలు

- లెక్కల్లేని సొమ్ము అక్షరాలా రూ.47 కోట్లు...
- జిల్లాలోని పది పెద్ద ఆలయాల్లోని పరిస్థితి ఇది..
- దేవుడి సొమ్ముకు కాపలా కాయాల్సిన వారే చేతివాటం చూపించడం.. అదే బాటలో సిబ్బంది సైతం అందినకాడికి దొంగ లెక్కలు రాయడంతో ఈ అక్రమాలు చోటుచేసుకున్నాయి.

ఈనాడు – అమరావతి

జిల్లాలోని దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో పెద్ద ఎత్తున ఆదాయం పక్కదారి పడుతోంది. భక్తులు మొక్కుల రూపంలో సమర్పించిన నగదు, నగలు, దుకాణాల అద్దెలు, కౌలు ద్వారా సమకూరిన సొమ్మును కొంతమంది కార్యనిర్వహణాధికారులు జేబులో వేసుకుంటున్నారు. ఆలయానికి వచ్చే ఆదాయాన్ని పక్కదారి పట్టకుండా.. లోపాలుంటే గుర్తించి కట్టడి చేయాల్సిన వారు సొమ్మును సొంతానికి వాడేసుకుని ఏదో ఒక ఖర్చులో రాయాలని కిందిస్థాయి సిబ్బందికి చెబుతుండడంతో దొంగ చేతికి తాళాలిచ్చినట్లవుతోంది. వీరు సైతం చేతివాటం ప్రదర్శించి అందినకాడికి వెనకేసుకుంటున్నారు.

ఉపకమిషనర్, సహాయ కమిషనర్, గ్రేడ్-1 కార్యనిర్వహణాధికారులు పర్యవేక్షించే పది పెద్ద ఆలయాల్లో రూ.47 కోట్లకుపైగా సొమ్ముకు ఆడిట్ అభ్యంతరాలు వ్యక్తమైనా లెక్కలు చెప్పలేదు. వీటిపై ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించి లోపాలు సరిదిద్ది ఉంటే ఈ పరిస్థితి ఉత్పన్నమయ్యేది కాదు.

పెదకాకాని శ్రీమల్లేశ్వరస్వామి ఆలయం

జిల్లాలో ప్రముఖ ఆలయాల్లో ఆడిట్ అభ్యంతరాల నివేదికల్లో వివరాలు ఇలా.....

ఆలయం	గ్రామం	అభ్యంతరాలు	రూపాయల్లో	సంవత్సరం
మల్లేశ్వరస్వామి	పెదకాకాని	1,445	24,64,62,732	2006-07 నుంచి 2024-25
లక్ష్మీనరసింహస్వామి	మంగళగిరి	1,978	9,74,90,203	1998-99 నుంచి 2024-25
జగన్నాథ, ఆంజనేయ, వెంకటేశ్వరస్వామి	గుంటూరు	577	7,64,88,691	1986-87 నుంచి 2024-25
మహంకాళి అమ్మవారు	కె.కొండూరు	382	1,96,41,836	1986-87 నుంచి 2024-25
భావన్నారాయణస్వామి	పొన్నూరు	785	1,67,73,347	2004-05 నుంచి 2024-25
కన్యకాపరమేశ్వరి అమ్మవారు	గుంటూరు	1,138	1,61,65,210	2006-07 నుంచి 2024-25
సహస్రలింగేశ్వరస్వామి	పొన్నూరు	567	1,24,98,363	2004-05 నుంచి 2024-25
లక్ష్మీనరసింహస్వామి	గుంటూరు	388	44,88,265	2007-08 నుంచి 2024-25
పోలేరమ్మ అమ్మవారు	కొండపాటూరు	405	39,29,044	1986-87 నుంచి 2024-25
లక్ష్మీపద్మావతి వెంటేశ్వరస్వామి	వైకుంఠపురం	542	22,34,000	2006-07 నుంచి 2024-25

జిల్లాలో అత్యధికంగా ఉప కమిషనర్ స్థాయి అధికారి పర్యవేక్షించే పెదకాకానిలోని శ్రీమల్లేశ్వరస్వామి ఆలయంలో రెండు దశాబ్దాల ఆడిట్ నివేదికలు పరిశీలిస్తే ఏకంగా రూ.24.64 కోట్లకు అభ్యంతరాలు పెండింగ్‌లో ఉండడం గమనార్హం. మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి, గుంటూరులోని శ్రీజగన్నాథ, ఆంజనేయ, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లోనూ రూ.కోట్ల సొమ్ము పక్కదారి పట్టినట్టు ఆడిట్ నివేదికల్లో స్పష్టమవుతున్నా చర్యలు శూన్యం.

చెల్లని చెక్కు కేసులో తెలుగులో తీర్పు

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: చెల్లని చెక్కు కేసులో తెలుగులో తీర్పు వెలువరించి గుంటూరు ప్రధాన జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి **పల్లగాని రాజశేఖర్** కొత్త ఒరవడి సృష్టించారు. ఇప్పటికే అక్కడక్కడా తెలుగులో తీర్పులు వెల్లడిస్తున్న న్యాయస్థానాల జాబితాలో గుంటూరు కోర్టు కూడా చేరడం విశేషం. గతంలో గుంటూరులో విధులు నిర్వహించి, ప్రస్తుతం విజయవాడ విద్యుత్తుశాఖలో పనిచేస్తున్న బెజవాడ దిలీప్ వెంకటనాగేశ్వరరావు అనే వ్యక్తి అదే శాఖలో పని చేస్తున్న పైడిపాగ రాజారావుకు 2023లో కొంత నగదు ఇచ్చారు. ఆయన ఆ నగదును 2025లో వడ్డీ సహా చెక్కు రూపంలో చెల్లించారు. అది చెల్లకపోవడంతో వెంకటనాగేశ్వరరావు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం సోమవారం తీర్పు వెల్లడించింది. ఆరు పేజీలున్న ఈ తీర్పును పూర్తిగా తెలుగుభాషలో వెల్లడించడం విశేషం. ప్రతివాది తీసుకున్న మొత్తాన్ని వడ్డీతో చెల్లించాలని న్యాయమూర్తి ఆదేశించారు.

రాకరాక వచ్చె.. రణరంగమాయె..

గంటల తరబడి బస్టాండ్లలో పడిగాపులు కాస్తున్నాం. బస్సు వస్తే ఎక్కలేని పరిస్థితి. సీట్లు దొరక్క వృద్ధులు, మహిళలు చాలా ఇబ్బంది పడుతున్నారు. కనీసం గంటన్నర ఎదురుచూస్తే తప్ప బస్సు ఎక్కలేకపోతున్నాం. అధికారులకు ఈ పరిస్థితి కనిపించడం లేదా? రద్దీకి తగ్గట్టుగా బస్సుల సంఖ్య ఎందుకు పెంచడం లేదు?

- గుంటూరు ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో పలువురు ప్రయాణికుల ఆగ్రహమిది.

గుంటూరు ఆర్టీసీ బస్టాండులో బస్సు ఎక్కేందుకు భారీగా ప్రయాణికుల రద్దీ

ఈనాడు – అమరావతి

ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీ ప్రయాణం సామాన్యులకు నరకప్రాయంగా మారింది. భారీగా పెరిగిన రద్దీకి తగ్గట్టుగా బస్సుల్లేకపోవడంతో ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు. గుంటూరు నుంచి బాపట్ల, చీరాల, తెనాలి, మాచర్ల, విజయవాడ వంటి ప్రధాన మార్గాల్లో ప్రయాణించాలంటేనే జనం బెంబేలెత్తిపోతున్నారు. ఆర్టీసీ అధికారుల ప్రణాళిక లోపం వారికి శాపంగా మారింది.

జిల్లాలోని గుంటూరు-1, 2, తెనాలి, మంగళగిరి, పొన్నూరు డిపోల పరిధిలో ఉన్న బస్సులు కేవలం 371 (సొంతం 284, అద్దె 87). నిత్యం ప్రయాణిస్తున్నవారు 1.63 లక్షల మంది. ఒక్క ఎన్టీఆర్ బస్‌స్టేషన్ నుంచే ప్రతిరోజూ లక్ష మంది రాకపోకలు సాగిస్తున్నారు.

తోపులాటలు.. గొడవలు...

బస్‌స్టేషన్లలో ఉదయం, సాయంత్రం వేళల్లో పరిస్థితి దారుణంగా ఉంటోంది. కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, విద్యాసంస్థలకు వెళ్లే విద్యార్థులు, వ్యాపారులతో అవి కిక్కిరిసిపోతున్నాయి. పనులు ముగించుకుని వెళ్లే వారితో సాయంత్రం విపరీతమైన రద్దీ ఉంటోంది. బస్సులు పాయింట్లలోకి రాకముందే సీట్ల కోసం ప్రయాణికులు ప్రమాదకరస్థితిలో పరుగులు పెడుతున్నారు. కొంతమంది కదులుతున్న బస్సులు ఎక్కుతున్నారు. దీంతో డ్రైవర్లు పాయింట్ల వద్దకు వేగంగా తీసుకొస్తుండడంతో ప్రమాదాలకు అవకాశం ఉంది. సీట్ల కోసం తోపులాటలు, తీవ్ర వాగ్వాదాలు నిత్యకృత్యమయ్యాయి.

స్త్రీశక్తి రద్దీ.. పెరగని బస్సులు

గతేడాది ఆగస్టు 15న ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకంతో రద్దీ అనూహ్యంగా పెరిగింది. అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటివరకు 3.19 కోట్లమంది మహిళలు జిల్లాలో ఉచితంగా ప్రయాణించారు. రోజువారీ ప్రయాణికుల్లో లక్ష మంది (62%) వారే. పల్లెవెలుగు బస్సుల్లో కాలు మోపలేని పరిస్థితి. రద్దీకి తగ్గట్టుగా బస్సుల్లేకపోవడం సమస్యగా మారింది.

జిల్లాలో 18 మండలాలు, 222 గ్రామాలను కలుపుతూ 121 రూట్లలో బస్సులు నడుపుతున్నామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అవస్థలను పట్టించుకోవడం లేదు. బాపట్ల, చీరాల రూట్లలో ప్రత్యేక సర్వీసులు నడపాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కాటాల లోపమా.. తూకంలో తేడానా..

దుగ్గిరాల, న్యూస్‌టుడే: దుగ్గిరాల మార్కెట్ యార్డులో పసుపు కాటాల కొలతల్లో తేడాపై రైతు వెనిగళ్ల కిశోర్ తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేశారు. యార్డులో రైతు సరకు అమ్మేశాక 71 కిలోలు ఒక బస్తాగా కాటా వేసి వ్యాపారులకు ఇచ్చేస్తారు. 100 నుంచి 200 గ్రాములు తేడా ఉండొచ్చు. సోమవారం వేసిన కాటాలో కొన్ని బస్తాలు 72 కిలోలకు పైగానే తూగడంతో తాము ఎంతో నష్టపోతున్నామని కిశోర్ ఆవేదన వ్యక్తం చేశారు. మొదట ఆయన కచ్చితమైన కాటా వేసి 35 బస్తాలు తెచ్చారు. సరకు అమ్మేశాక కాటా వేయగా.. 34 బస్తాలే వచ్చాయని చెప్పడంతో ఖిన్నుడయ్యారు. సాయంత్రం మళ్లీ కాటాలు వేయించారు. కొన్ని బస్తాలు 72.700, మరికొన్ని 72.400 కిలోలు చూపాయి, ఇంకొన్ని 71 కిలోలున్నాయి. అప్పుడు అదనంగా ఉన్న సరకును తీసేసి కాటా వేశారు. తాను మొదటే కాటా వేసి తెచ్చుకున్నందున తెలిసిందని, అదే నేరుగా తెస్తే తేడా ఏం తెలుస్తుందన్నారు. కిలో కొమ్ములు రూ.150 వరకు ధర పలుకుతుంటే.. ఒక బస్తా తగ్గితే రూ.వేలల్లో నష్టపోతామన్నారు.

పల్నాడు జిల్లా దేవాదాయశాఖ

అధికారికి ఛార్జిమెమోలు

15 రోజుల్లో సమాధానం ఇవ్వాలని కమిషనర్ ఆదేశం

నిబంధనలకు విరుద్ధంగా ఏడుగురికి పీఆర్సీ వర్తింపు

పెంచుకో... పంచుకో...

ఈనాడులో ఆగస్టు 19న ప్రచురితమైన కథనం

ఈనాడు -అమరావతి

నిబంధనలు అతిక్రమించి ఉద్యోగులకు పీఆర్సీ వర్తింపజేసినందుకు పల్నాడు జిల్లా దేవాదాయశాఖ అధికారి అచ్యుత వెంకట శ్రీనివాస్‌కు నాలుగు ఛార్జిమెమోలు జారీచేస్తూ కమిషనర్ ఉత్తర్వులిచ్చారు. వీటిని అందుకున్న 15 రోజుల్లో లిఖితపూర్వకంగా సమాధానం ఇవ్వని పక్షంలో అందుబాటులో ఉన్న రికార్డుల సమాచారం ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అర్హత లేని వారికి పీఆర్సీ వర్తింపజేశారని ఆగస్టు 19న 'ఈనాడు'లో 'పెంచుకో.. పంచుకో' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కమిషనర్ గుంటూరులోని ఉప కమిషనర్‌ను విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కోరారు. ఉప కమిషనర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆగస్టు 29న పల్నాడు జిల్లా దేవాదాయశాఖ అధికారికి నాలుగు ఛార్జిమెమోలు ఇచ్చారు.

ఉత్తర్వులు ఇలా..

1. కమిషనర్ నుంచి ముందస్తు అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నలుగురు జూనియర్ సహాయకులకు పీఆర్సీ 2022, ఇద్దరు జూనియర్ సహాయకులు, ఒక అటెండర్‌కు పీఆర్సీ 2015ను వర్తింపజేశారు.
2. పల్నాడు జిల్లా దేవాదాయశాఖ అధికారి హోదాలో నిబంధనలు ఉల్లంఘించి ఇచ్చిన పీఆర్సీ ఉత్తర్వులను గోప్యంగా ఉంచారు. ఈ విషయం పత్రికలో రావడంతో దేవాదాయశాఖకు చెడ్డ పేరు వచ్చింది.
3. సరైన పరిశీలన లేకుండానే సంబంధిత ఆలయాల కార్యనిర్వహణాధికారుల నివేదికల ఆధారంగా పీఆర్సీ అమలు ఉత్తర్వులు ఇచ్చారు.
4. పల్నాడు జిల్లా దేవాదాయశాఖ అధికారి హోదాలో సర్క్యులర్లు, సూచనలు పాటించకుండా స్వతంత్ర నిర్ణయాలు తీసుకున్నారు. అధికార పరిధి లేకుండా వ్యక్తిగత హోదాలో పీఆర్సీని అమలుచేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

కాలువల వెంబడి గస్తీ

రైతులు నీటిని సాగు అవసరాలకు మళ్లించకుండా చర్యలు

ఈనాడు – అమరావతి

నాగార్జున సాగర్ కుడి కాలువ ద్వారా విడుదల చేస్తున్న నీటితో జిల్లాలోని తాగునీటి చెరువులు నింపడానికి జిల్లా యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేసింది. రైతులు అనధికారికంగా నీటిని తోడకుండా.. కాలువల వెంబడి పెట్రోలింగ్ చేసేందుకు జలవనరులశాఖ, రెవెన్యూ, పోలీస్, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ అధికారులతో బృందాలను ఏర్పాటు చేసింది. కలెక్టర్ ఆదేశాలను పాటించడంలో విఫలమైతే తీవ్రంగా పరిగణించి క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నారు.

ప్రత్తిపాడు: నీటిని విడుదల చేస్తున్న ఈఈ మురళీధర్, డీఈ మల్లికార్జునరావు, డీసీ ఛైర్‌పర్సన్ కుసుమ

కాలువ	నిం.చె.
బండారుపల్లి మేజర్	15
వంకాయలపాడు మేజర్	18
కొండవీడు మేజర్	2
పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్	50
మొత్తం	85

నిం.చె.: నింపే చెరువులు

14 రోజులే సమయం

తాగునీటి చెరువులను నింపడానికి 14 రోజులు మాత్రమే కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎల్‌నినో నేపథ్యంలో సాగర్ జలాశయంలో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున కాలువలకు పూర్తిస్థాయిలో నీరివ్వడం లేదు. దీంతో కొన్నిచోట్ల శివారున ఉన్న చెరువులకు నీరందని పరిస్థితి. ఇలాంటిచోట ఆయిల్ ఇంజిన్ల ద్వారా తోడించాలని నిర్ణయించారు.

85 తాగునీటి చెరువులు నిండేలా...

జిల్లాలో సాగర్ కాలువల కింద తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాల పరిధిలో 85 తాగునీటి చెరువులున్నాయి. కాలువలు మొత్తం మెట్ట ప్రాంతం మీదుగా ప్రయాణిస్తున్నందున పంటలకు మళ్లించకుండా క్షేత్రస్థాయిలో బృందాలు నిరంతరం గస్తీ తిరిగేలా ప్రణాళిక రూపొందించారు. ఏ కాలువ కింద ఏ చెరువు నింపాలో కసరత్తు పూర్తి చేశారు.

ప్రజల సంతృప్తిస్థాయిలో ఏడో స్థానం

బీసీ సంక్షేమ శాఖ ప్రథమం

జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే : ప్రభుత్వ పథకాల అమలులో ప్రజల సంతృప్తి స్థాయిలో జిల్లా 7వ స్థానంలో నిలిచింది. ఆగస్టు నెలకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన నివేదిక ప్రకారం.. అన్ని పథకాల అమలుకు సంబంధించి ప్రజలు సంతృప్తి చెందుతున్నారా? లేదా? అనే దాని గురించి ఐవీఆర్ఎస్- బెస్ట్ సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌ను పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ (పీపీపీ) సర్వే చేస్తోంది. ప్రజలకు ఫోన్ చేసి, ఆయా పథకాల అమలులో సంతృప్తి చెందుతున్నారా? లేదా? సిబ్బంది పనితీరు బాగుందా? లేదా? అని ప్రశ్నలు అడిగి.. వివరాలు తెలుసుకుంటున్నారు. లబ్ధిదారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసిన తర్వాత ఆటోమేటిక్‌గా నమోదవుతుంది. ☛ సంక్షేమ శాఖలపరంగా చూస్తే బీసీ సంక్షేమ శాఖ పీపీపీలో ప్రథమం స్థానంలో నిలిచింది. బీసీ సంక్షేమ హాస్టళ్లలో మెనూ ప్రకారం భోజనం అందజేస్తున్నారా? లేదా? అనే ప్రశ్నకు 84.81 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. వార్డెన్ పనితీరు బాగుందా..? లేదా..? అనే దానికి 84.59 శాతం మంది అవుని అని.. తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణపై 80.23 శాతం మంది, విద్యార్థుల భద్రతా ఏర్పాట్లు బాగున్నాయా? అనే దానిపై 70.96 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. మొత్తంగా ఈ శాఖ మొదటి స్థానంలో నిలిచింది. ☛ రాష్ట్రంలోని 28 జిల్లాలకు గాను జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ 27వ ర్యాంక్‌లో నిలిచింది. మెనూ ప్రకారం భోజనం అందజేస్తున్నారా? అనే ప్రశ్నకు 74.51 శాతం, వార్డెన్ల పనితీరుపై 65.32 శాతం, తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణపై 63.72 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. వసతిగృహాలను జిల్లా అధికారి కె.ఎల్.హర్షిత తనిఖీలను చేయకపోవడంతో పాటు ఏఎస్‌డబ్ల్యూవోలు మొక్కుబడిగా పర్యవేక్షణ చేయడంతో వార్డెన్ల పనితీరు తీసికట్టుగా మారింది. ☛ సాంఘిక సంక్షేమ గురుకులాలు 26వ స్థానంలో నిలిచాయి. విద్యాలయాల్లో భోజనం మెనూ అమలుపై 60.37 శాతం, తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణపై 52.13 శాతం, విద్యాలయాల్లో బోధనపై 60.83 శాతం మంది తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. ☛ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలు పీపీపీలో 3వ ర్యాంక్, గిరిజన గురుకులాలు 5వ ర్యాంక్‌ను సాధించాయి.

రాధారంగానగర్‌లో రూ.83 లక్షలతో ఉద్యానవనం

భూమిపూజ చేస్తున్న మోహనకృష్ణ, అలీంబాషా, సత్యనారాయణ

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి పరిధిలోని రాధారంగానగర్‌లో ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ సీఎస్ఆర్ నిధులు రూ.83 లక్షలతో నిర్మించనున్న ఉద్యాన వనానికి ఆ సంస్థ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ సోమవారం భూమి పూజ చేశారు. మంత్రి నారా లోకేశ్ మార్గదర్శకంలో పార్క్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఏపీలోనే మంగళగిరిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ మోడల్ నియోజకవర్గంగా లోకేశ్ తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. చిన్నారులు ఆటలాడుకునేందుకు, యువత వ్యాయామం చేయడానికి, వృద్ధులు సేద తీరేందుకు అనువైన రీతిలో దీని నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మంగళగిరిలో ఏపీటీఎస్ ఆధ్వర్యాన మోడల్ లైబ్రరీని ఏర్పాటుచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. మంగళగిరి అభివృద్ధికి తనవంతు సహకారం అందించడానికి అవకాశం కల్పిస్తున్న మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మంగళగిరి-తాడేపల్లి నగరపాలక కమిషనర్ అలీంబాషా, తెదేపా నియోజకవర్గ పరిశీలకుడు ముమ్మిడి సత్యనారాయణ, జనసేన మండల అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు, శ్రీశైలం ఆలయ పాలకవర్గ సభ్యుడు శంకరశెట్టి పిచ్చియ్య, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు కృష్ణవందన, తెదేపా నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు, ఈపూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

హత్యకు గురైన తండ్రి ఫొటో చూస్తూ.. 20 ఏళ్లుగా పగ

- నిందితుడిని చంపి.. పోలీసులకు లొంగిపోయిన కుమారుడు
- మరో 10 మంది అరెస్టు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: తండ్రి హత్యకు గురైనప్పుడు చంపిన వ్యక్తిపై పగ తీర్చుకోవాలని.. చనిపోయినప్పటి తండ్రి ఫొటో ఇంట్లో ఎదురుగా పెట్టుకుని.. నిత్యం చూస్తూ 20 ఏళ్లుగా పగ పెంచుకుంటూ వచ్చాడు. చివరకు సదరు వ్యక్తిని పక్కా ప్రణాళికతో తుదముట్టించాడు. గత నెల 30న కేవీపీ కాలనీలో పెంద్ర చిన్నా హత్య నేపథ్యమిది. కేసులో 11 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. సోమవారం నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌లో సీఐ రాజేష్‌తో కలిసి ఇన్‌ఛార్జి డీఎస్పీ సీతారాం వివరాలు వెల్లడించారు.

కుటుంబమంతా దారికాచి....

కేవీపీ కాలనీకి చెందిన పెండ్రాల బుల్లయ్యను 20 ఏళ్ల కిందట పెండ్రాల వెంకన్న అలియాస్ చిన్నా అలియాస్ కాకులోడు హత్య చేశాడు. బుల్లయ్య పెద్ద కుమారుడు ఇమ్మానుయేలురాజు.. చిన్నాపై పగ పెంచుకున్నాడు. రెండు దశాబ్దాలుగా పాత ఇనుప సామాను అమ్ముకుంటూ సూర్యాపేటలో తలదాచుకున్న చిన్నా ఆగస్టు 30న బాబాయి మత్తయ్య చనిపోవడంతో గుంటూరు వచ్చాడు. ఇది తెలిసి ఇమ్మానుయేలురాజు.. తన సోదరుడు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు మొత్తం 14 మందితో కలిసి హత్యకు పథక రచన చేశాడు. మద్యం తాగే అలవాటున్న చిన్నాను శనివారం రాత్రి వీఐపీరోడ్డులోని ఒక బార్ వద్ద హత్య చేయాలని ప్లాన్ చేశారు. చిన్నా అక్కడికి రాకపోవడంతో సాధ్యం కాలేదు. ఆదివారం ఉదయం కేవీపీ కాలనీలో అల్పాహారం తినడానికి వచ్చిన చిన్నాను వెంటాడారు. పరుగులు తీసిన అతడిని కొంతమంది కర్రలతో కొట్టడంతో కింద పడిపోగానే ఇమ్మానుయేలు రాజు పదునైన కత్తితో దాడి చేశాడు. తన తండ్రిని ఎక్కడెక్కడ కత్తితో పొడిచాడో అదే రీతిలో హత్య చేశాడు. ఈ ఘటనపై సీఐ రాజేష్ దర్యాప్తు చేపట్టారు. డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీఐ రాజేష్, ఎస్సైలు రాంబాబు, ప్రసన్నకుమార్, రామచంద్రారెడ్డి సిబ్బందితో బృందాలుగా గాలింపు చేపట్టారు. ఇమ్మానుయేలు రాజు, అమూల్యరాజు, దేవరాజు, గురవయ్య, శ్యామ్, బుజ్జి, జమాలమ్మ, రాజ్‌కుమార్, మోషేరాజు, షాలేమ్ రాజు, ఇరుగు బాబు లొంగిపోయారు. మరో ముగ్గురిని త్వరలో అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు

నిందితుల వివరాలు తెలుపుతున్న డీఎస్పీ సీతారాం, సీఐ రాజేష్, ఎస్సై ప్రసన్నకుమార్

జిల్లా పరిషత్తులకు భవనాల ఎంపిక

ములకలచెరువు పాలిటెక్నిక్ కళాశాలలో పల్నాడు

తితిదే కల్యాణ మండపంలో బాపట్ల కార్యాలయాలు

న్యూస్‌టుడే, జిల్లాపరిషత్తు

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్తు పాలకవర్గం గడువు సెప్టెంబరు 24తో ముగియనున్నందున నూతనంగా ఏర్పాటు కానున్న పల్నాడు, బాపట్ల జిల్లా పరిషత్తుల కార్యాలయాలకు భవనాలను అధికారులు ప్రాథమికంగా ఎంపిక చేశారు. పల్నాడు జిల్లా పరిషత్తు కార్యాలయాన్ని నరసరావుపేటకు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ములకలచెరువులోని మైనార్టీల పాలిటెక్నిక్ కళాశాల భవనాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక్కడ గదులు ఎక్కువగా ఉన్నాయి. బాపట్ల జిల్లా పరిషత్తు కార్యాలయాన్ని అక్కడి తితిదే కల్యాణ మండపంలో ఏర్పాటు చేయనున్నారు. రెండు కార్యాలయాలను తాత్కాలికంగా ఇక్కడ ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చాక నిబంధనల మేరకు ఉంటే ఖరారు చేస్తారు. ఛైర్మన్, సీఈవో, డిప్యూటీ సీఈవోతో పాటు విభాగాల ఏవోలు, సిబ్బంది కోసం కనీసం పది గదులైనా అవసరమవుతాయి. రికార్డులు, దస్త్రాలను భద్రం చేసేందుకు స్టోర్ రూమ్, కంప్యూటర్ రూమ్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

ఉద్యోగుల్లో ఉత్కంఠ

☛ మండల పరిషత్తు పాలకవర్గాల గడువు సెప్టెంబరు 23తో, జడ్పీ పాలకవర్గం పాలన 24తో ముగుస్తాయి. దీంతో వారం రోజుల ముందే గుంటూరు జిల్లా పరిషత్తు నుంచి పల్నాడు, బాపట్ల జిల్లా పరిషత్తులను వేరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చే అవకాశం ఉంది. సీఈవో, డిప్యూటీ సీఈవోలతో పాటు ఉద్యోగులను కేటాయించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి పాలకవర్గాలు కొలువుదీరే వరకు ఆయా జిల్లా కలెక్టర్లను జడ్పీ ప్రత్యేక అధికారులుగా నియమించనున్నారు. ☛ ఉమ్మడి జిల్లా పరిషత్తు ఉద్యోగులను గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా పరిషత్తులకు దామాషా విధానంలో కేటాయించాల్సి ఉండడంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ☛ జడ్పీ పునర్వ్యవస్థీకరణకు ముందే జిల్లా క్యాడర్‌లోని పోస్టుల ఖాళీలను పదోన్నతులు ద్వారా భర్తీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. జడ్పీ విభజన జరిగితే దీర్ఘకాలం పదోన్నతులిచ్చే పరిస్థితి లేదు. ఆఫీస్ సబార్డినేట్లు, రికార్డ్, ల్యాబ్ అసిస్టెంట్లు జూనియర్ అసిస్టెంట్లుగా.. జూనియర్ అసిస్టెంట్లు సీనియర్ అసిస్టెంట్లుగా.. ఎస్‌ఏలు పరిపాలన అధికారులుగా పదోన్నతుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

తాత్కాలికంగా ఎంపిక చేశాం

ఉమ్మడి జడ్పీ పాలకవర్గం గడువు ముగియనుండడంతో ఉన్నతాధికారుల సూచన మేరకు పల్నాడు, బాపట్ల జిల్లా పరిషత్తు కార్యాలయాల కోసం తాత్కాలిక భవనాలను ఎంపిక చేశాం. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఏర్పాటు చేస్తాం. **- వి.జ్యోతిబసు, సీఈవో, ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్తు**

(c) eenadu

క్వాంటమ్.. ఏఐ టెక్నాలజీలో ఏపీని అగ్రస్థానంలో నిలపాలి

తుళ్లూరు, న్యూస్‌టుడే: క్వాంటమ్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు అమరావతి క్వాంటమ్ మిషన్ చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న అన్నారు. అమరావతిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో మెంటార్ మ్యాపింగ్ క్వాంటమ్ ఇన్నోవేషన్ సెంటర్ బృందం ఏర్పాటు అనే అంశంపై కార్యశాల సోమవారం నిర్వహించారు. రాష్ట్రంలోని 21 జిల్లాల నుంచి 300 మందికి పైగా టెక్నాలజీ నిపుణులు, స్టార్టప్ సంస్థల ప్రతినిధులు, పరిశ్రమల భాగస్వాములు, వివిధ కళాశాలల అధ్యాపకులు హాజరయ్యారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

జ్యోతి వెలిగిస్తున్న ప్రద్యుమ్న, పక్కన యూనివర్సిటీ వీసీ సతీష్‌కుమార్

★ సీఎం కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న మాట్లాడుతూ అన్ని రంగాల్లో కృత్రిమ మేధస్సు కీలకంగా మారుతున్న తరుణంలో పరిశోధనలు మరింత విస్తృతం చేయాలని సూచించారు. సంపద సృష్టికి నూతన ఆవిష్కరణలు, స్టార్టప్‌ల ఆవశ్యకత ఎంతో అవసరమన్నారు. ఆధునిక సాంకేతికతతోనే అది సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సమాజంలో ఎదురవుతున్న వాస్తవ సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు చూపేలా కొత్త అల్గారిథమ్‌లు అభివృద్ధి చేయాలన్నారు.

★ విశిష్ట అతిథి ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ సాంకేతిక అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలన్నారు. ఈ ఏడాది ఏయూలో వీఎల్ఎస్ఐ డిజైన్ కోర్సు ప్రారంభించినట్లు తెలిపారు.

★ సీవీ శ్రీధర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మిషన్ లక్ష్యాలు, భవిష్యత్తు కార్యాచరణ, క్వాంటమ్ టెక్నాలజీ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలు వివరించారు. టెక్నాలజీ వినియోగానికి ఉన్న వివిధ అవకాశాలను గుర్తించడం, ఆయా రంగాలకు తగిన మెంటార్లను అనుసంధానించడం, భవిష్యత్తు ప్రాజెక్టులకు అవసరమైన నిపుణుల ఎంపిక తదితర అంశాలపై చర్చించారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వీసీ ఆచార్య సీహెచ్ సతీష్‌కుమార్ స్వాగత ఉపన్యాసం చేశారు. క్వాంటమ్, ఏఐ టెక్నాలజీల అభివృద్ధికి వర్సిటీలో ఇన్‌స్టిట్యూట్‌లు ప్రారంభించామని తెలిపారు. ఆయా రంగాల్లో పరిశోధనలను మరింత విస్తృతం చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో క్వాంటమ్ వ్యాలీ ప్రతినిధి తాడికొండ వెంకటస్వామి, క్వాంటమ్ ఇండియా-ఐబీఎం లీడ్ శేష రఘునాథన్, టీసీఎస్ లీడ్ గ్రాండ్ ప్రే మతాల్స్ పాల్గొన్నారు.

భూ సమీకరణ పూర్తయితే ప్లాట్లు కేటాయిస్తాం

తుళ్లూరు, న్యూస్‌టుడే: ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి రెండో దశ ల్యాండ్ పూలింగ్‌లో రైతులు వ్యవసాయ భూములు ఇస్తే వెంటనే రిటర్నబుల్ ప్లాట్లు అందించడానికి వీలవుతుందని కలెక్టర్ ఎస్.ఎం.సాయికాంత్‌వర్మ తెలిపారు. తుళ్లూరు మండలం పెదపరిమిలో తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌తో కలిసి కలెక్టర్ సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మాణం చేస్తుందన్నారు. భూ సమీకరణలో భూములు ఇవ్వడానికి రైతులు ముందుకు రావాలని, భూమి పత్రాలు చూపించిన చోట వాటి సరిహద్దులు సైతం చూపించాలని విజ్ఞప్తి చేశారు. తాడికొండ నుంచి పెదపరిమి వరకు త్వరలో నూతన రహదారిని నిర్మించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతుల సందేహాల నివృత్తి కోసం కలెక్టర్ రెవెన్యూ గ్రీవెన్స్ నిర్వహించారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రైతుల రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. గ్రామసభలో 28 మంది 45 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్‌లో ఇచ్చేందుకు భూమి పత్రాలు అందించారు. ఈసందర్భంగా నిర్వహించిన గ్రామసభలో రైతులు పలు సమస్యలు వెల్లడించారు. తాడికొండ నుంచి పెదపరిమి వరకు కొత్త రహదారి నిర్మించాలని కోరారు. గ్రామంలో తాగు నీరు, రోడ్లు, డ్రెయినేజీ, భూమి కొలతలు, వివాదాలు, రీసర్వే సమస్యలు పరిష్కరించాలని కోరారు.

కలెక్టర్ సాయికాంత్ వర్మ, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, భాష్యం ప్రవీణ్‌లకు భూమి పత్రాలు అందిస్తున్న రైతులు

రాష్ట్ర పోలీస్ క్రీడా పోటీల ఏర్పాట్ల పరిశీలన

మంగళగిరి ఏపీఎస్పీ ఆరో బెటాలియన్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

తాడేపల్లి, న్యూస్‌టుడే: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళగిరిలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ పరేడ్ మైదానంలో మంగళవారం సాయంత్రం నిర్వహించనున్న రాష్ట్ర పోలీస్ క్రీడా పోటీల ప్రారంభోత్సవ ఏర్పాట్లను ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం పరిశీలించారు. ప్రారంభోత్సవానికి డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ముఖ్య అతిథిగా హాజరవుతున్న నేపథ్యంలో భద్రత, పార్కింగ్, తాగునీరు, వసతి, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమం సజావుగా జరిగేలా సమన్వయంతో పని చేయాలని, పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. క్రీడల్లో భాగంగా అమరావతి విట్ కళాశాలలో ఇండోర్, అవుట్‌డోర్ క్రీడలు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ట్రాక్ అండ్ ఫీల్డ్, మంగళగిరిలో ఈత, కృష్ణానదిలో జల క్రీడలు, తాడేపల్లి నులకపేట ఫైరింగ్ రేంజ్‌లో షూటింగ్, ఫైరింగ్ పోటీలు నిర్వహించనున్నారు. స్పెషల్ బ్రాంచి డీఎస్పీ అలహరి శ్రీనివాసు, ఆర్ఐ వెల్ఫేర్ సురేష్‌బాబు, 6వ బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

‘సీఎం సార్.. మా డబ్బులు ఇవ్వండి’

ప్రదర్శనగా వస్తున్న ఏపీ జేఏసీ అమరావతి జిల్లా నాయకులు

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే : సీఎం సార్.. మా డబ్బులు మాకు ఇవ్వండి అంటూ ఏపీ జేఏసీ అమరావతి గుంటూరు జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందించారు. జిల్లా ఛైర్మన్ పి.ఎ.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఉద్యోగుల హక్కుల సాధనకు ఉద్యమ కార్యాచరణ ప్రకటించామన్నారు. సెప్టెంబరు 11 వరకు వివిధ రకాల కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సెప్టెంబరు 2 నుంచి 5వ తేదీ వరకు ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరవుతూ, హ్యాండ్ టూ హ్యాండ్ కార్యక్రమం ద్వారా ఉద్యోగులను ఉద్యమంలో భాగస్వామ్యం చేస్తామని, మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు. 11వ తేదీ నుంచి అన్ని జిల్లా కేంద్రాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు, కార్మిక, ఉద్యోగ సంఘాల నాయకులతో ఉద్యమ కార్యాచరణపై చర్చిస్తామన్నారు. సెప్టెంబరు 15 నుంచి 26 వరకు రెండో దశ ఉద్యమం ఉంటుందన్నారు. వర్క్ టు రూల్ ఉద్యమం, సోషల్ మీడియాలో ప్రచారం, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించడం, నల్ల కండువాలతో నిరసన తెలుపుతామన్నారు. 23న కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల వద్ద ధర్నాలు, 26న కుటుంబ సభ్యులతో కలిసి నిరసనలు తెలియజేస్తామని వివరించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే మూడో దశ ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామన్నారు. మహిళా విభాగం జిల్లా ఛైర్మన్ భువనేశ్వరి మాట్లాడుతూ.. ఉద్యోగులు అప్పులు చేయనిదే కుటుంబాలు గడవని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం దీనిపై స్పందించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో జేఏసీ గౌరవాధ్యక్షుడు గోపాలకృష్ణ, జిల్లా కార్యదర్శి రజనీకాంత్, కొల్లిపర తహసీల్దార్ సిద్ధార్థ, కలెక్టరేట్ ఏవో మల్లేశ్వరి, నాయకులు దివ్యదుర్గ, వెంకట్రావు, రామారావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య భద్రతే లక్ష్యం

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పేదలకు వైద్య సేవలందించి ఆరోగ్య భద్రత కల్పించేందుకు పెదనందిపాడులో రియల్ ప్రైమరీ హెల్త్ సెంటర్ అభివృద్ధి చేయనున్నట్లు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. పెదనందిపాడులో రూ.1.93 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే రామాంజనేయులుతో కలిసి సోమవారం ఆయన భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతికేళ్ల క్రితం ఇక్కడ నిర్మించిన పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరిందన్నారు. ఇప్పుడు నిర్మించబోయే భవనం 50 ఏళ్లు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు, ప్రజలు కూడా పనుల నాణ్యతను పర్యవేక్షించాలని సూచించారు. ఇక్కడి ఆరోగ్య కేంద్రంలో 14 మంది సిబ్బంది రోగులకు వివిధ రకాల సేవలందిస్తారని, స్థానిక పీహెచ్‌సీలో సేవల వల్ల జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌పై భారం తగ్గుతుందన్నారు. ప్రత్తిపాడు ప్రాంతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరుగుతోందన్నారు. ఆసుపత్రిని దేవాలయంగా భావించాలని చెప్పారు. నిర్దేశించిన సమయంలో భవన నిర్మాణం పూర్తి చేయాలని గుత్తేదారుడికి సూచించారు. గుంటూరు ఛానల్ పొడిగింపు దశల వారీగా పూర్తి చేస్తారని చెప్పారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతుంటే వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను ఆక్రమించడంలో ఉన్న శ్రద్ధ ఆరోగ్య కేంద్రం మరమ్మతులు చేయించడంలో ఆ పార్టీ నాయకులకు లేదని విమర్శించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, తహసీల్దార్ కల్యాణి, మండల తెదేపా అధ్యక్షుడు రఘురామారావు, నాయకులు వెంకటేశ్వరరావు, హనుమంతరావు, చెంచయ్య, శ్రీనివాసరావు, ప్రసాద్, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పక్కన ఎమ్మెల్యే రామాంజనేయులు

దేశ సమగ్రతకు సంస్కృత భాష దోహదం

సభలో అకాడమీ ఛైర్మన్ ఆర్.డి.విల్సన్, పాతూరి నాగ భూషణం తదితరులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: దేశంలోని అన్ని భాషలకు సంస్కృతమే మూలమని దిల్లీ లాల్ బహదూర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ మనోహర్ పాఠక్ అన్నారు. తాడేపల్లి పరిధి ఫార్చ్యూన్ హోటల్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన సంస్కృత సప్తాహం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సంస్కృత భాషను అందరికీ చేరువ చేయాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం గొప్పదని పేర్కొన్నారు. తిరుపతి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ దేశ సమగ్రతకు సంస్కృత భాష ఎంతగానో ఉపకరిస్తుందని, దీనిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. దిల్లీ సెంట్రల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ గాయత్రి మురళీకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో సంస్కృత యూనివర్సిటీ ఉందన్న విషయం తమకు తెలియదన్నారు. తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ ఆర్.డి.విల్సన్ (శరత్ చంద్ర) ఆధ్వర్యంలో గుర్తింపు పొందిందని తెలిపారు. భవిష్యత్తులో అకడమిక్, ఆర్థిక సహకారం అందిస్తామని పేర్కొన్నారు. తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ ఆర్.డి.విల్సన్ మాట్లాడుతూ దేశ సమైక్యతకు సంస్కృత భాష అధ్యయనం అనివార్యమన్నారు. దీనిని ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ సంస్కృత వర్సిటీ వైస్ ఛాన్సలర్ పెన్నా మధుసూదన్ మాట్లాడుతూ భాషా ప్రాధాన్యాన్ని, దాని అధ్యయనం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. సంస్కృత సప్తాహం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల ద్వారా సంస్కృత భాషపై విద్యార్థులు, భాషాభిమానుల్లో ఆసక్తి పెంపొందించేందుకు కృషి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భాజపా సంఘటన కార్యదర్శి మధుకర్, సప్తాహం నిర్వాహకులు డాక్టర్ రంగాచార్యులు, శ్యామలానంద ప్రసాద్, నరసింహాచార్యులు, భాజపా నేత పాతూరి నాగభూషణం, ఎన్నారై కోమటి జయరాం తదితరులు పాల్గొన్నారు.

చలపతి యూనివర్సిటీ వీసీగా బీవీ చౌదరి

తాడికొండ, న్యూస్‌టుడే: చలపతి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ బి.వి.చౌదరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఛాన్సలర్ డాక్టర్ వై.వి.ఆంజనేయులు మాట్లాడుతూ బి.వి.చౌదరికి విద్య, పరిశోధన రంగాల్లో 30 ఏళ్లకు పైగా అనుభవం ఉందని తెలిపారు. ఐఐటీ దిల్లీ నుంచి ఎంటెక్, పీహెచ్‌డీ పట్టాలు పొందారన్నారు. వెస్ట్ ఇండీస్‌లో సుమారు 25 సంవత్సరాల పాటు డీన్‌గా, ప్రొఫెసర్‌గా సేవలందించారని చెప్పారు. 15 మంది విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించి 175 పరిశోధన పత్రాలు ప్రచురించారని వివరించారు. వైస్ ఛాన్సలర్ బి.వి.చౌదరి మాట్లాడుతూ యూనివర్సిటీలో విద్య, పరిశోధన రంగాలు, ఆవిష్కరణలను మరింత వృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన పరిశోధన అవకాశాలు, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. అనంతరం ప్రొ ఛాన్సలర్ వై.సుజిత్‌కుమార్, అధ్యాపక బృందం చౌదరిని సన్మానించారు.

బీవీ చౌదరిని సన్మానిస్తున్న ప్రొ ఛాన్సలర్ సుజిత్‌కుమార్, అధ్యాపకులు

ఆలస్యంగానైనా ఆర్థిక సాయం ప్రకటించినందుకు ధన్యవాదాలు

ఈనాడు, అమరావతి: చిలకలూరిపేటలో ఆగస్టు 27న చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో వేలూరుకు చెందిన 8 మంది మాదిగ సామాజికవర్గానికి చెందిన వారు మృతి చెందిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున మొత్తం రూ.80 లక్షల ఆర్థిక సాయం ప్రకటించడాన్ని ఎమ్మార్పీఎస్ స్వాగతిస్తోందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఆలస్యంగానైనా స్పందించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలని చెప్పారు. ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని ఎవరూ కోరలేదని, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆర్థికసాయం గురించి సీఎం దృష్టికి తీసుకెళ్లలేదన్నారు. పైపెచ్చు మృతులు ఏ పార్టీ వారని విచారించడం దారుణమన్నారు. సోమవారం గుంటూరులోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, నష్ట పరిహారం చెల్లించాలని ఎమ్మార్పీఎస్ రోడ్డెక్కి ఆందోళన చేసినట్లు చెప్పారు. వర్గీకరణ అంశంపై చంద్రబాబు మాత్రమే మద్దతు ప్రకటించారని, జాతి ప్రయోజనాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చినట్లు చెప్పారు.

మాట్లాడుతున్న మంద కృష్ణ

చంపేస్తున్నారు.. కాపాడండి..

రక్తపుధారలతో పోలీసులను ఆశ్రయించిన మహిళ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: తనను చంపేస్తున్నారు.. కాపాడాలంటూ రక్తపు గాయాలతో గుంటూరు పోలీసు కార్యాలయానికి పరుగున వచ్చారు సునీత అనే మహిళ. ముఖం నిండా రక్తపు ధారలతో ఉన్న ఆమెను చూసిన పోలీసులు, ఇతర ఫిర్యాదుదారులు కొంత ఆందోళన చెందారు. ఆమెను వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలని చెప్పడంతో భర్త ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. సాయంత్రం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు ఇచ్చారు. ఈ సందర్భంగా సునీత, ఆమె భర్త విలేకరులతో మాట్లాడారు. గోరంట్లకు చెందిన తాము కళాశాలల శుభ్రత, నిర్వహణ (హౌస్ కీపింగ్) కాంట్రాక్టు పనులు చేస్తుంటామని చెప్పారు. గోరంట్ల, పలకలూరు ప్రాంతాల్లోని పలు కళాశాలలకు సంబంధించిన కాంట్రాక్టులను రద్దు చేసుకోవాలని కొన్ని నెలలుగా కొంతమంది బెదిరిస్తున్నారని తెలిపారు. కొన్నాళ్ల కిందట వారు ఇంటికొచ్చి బీరు సీసాలు పగలగొట్టి చంపేస్తామని బెదిరించారని చెప్పారు. సోమవారం గోరంట్ల రోడ్డులో ఒక కళాశాల వద్ద వారు కొంతమంది మహిళలను తీసుకొచ్చి తమపై దాడి చేశారన్నారు. కత్తులు, రాళ్లతో చంపాలని చూశారని ఆరోపించారు. బాధితుల ఫిర్యాదుపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులు సిబ్బందిని ఆదేశించారు.

ఆసుపత్రికి వెళ్లి చికిత్సపొందాలని సూచిస్తున్న పోలీసులు

✦ సునీత ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని నల్లపాడు సీఐ భాస్కర్ తెలిపారు. ఆమె ఇక్కడికి రావడానికి ముందే సునీత తమపైనే దాడి చేసిందంటూ మరో వర్గానికి చెందిన వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదుపైనా కేసు నమోదు చేశామని చెప్పారు. రెండింటిపైనా లోతుగా దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రధాన కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి పదవీ విరమణ

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: గుంటూరు నగరంలోని ప్రధాన కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి ఎస్‌కే సికిందర్‌బాషా సోమవారం పదవీ విరమణ చేశారు. అదనపు కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తిని ప్రధాన కుటుంబ న్యాయస్థానం ఇన్‌ఛార్జిగా నియమించారు. సికిందర్‌బాషాను సోమవారం సాయంత్రం అదనపు జిల్లా న్యాయమూర్తులు వీఏఎల్ సత్యవతి, నాగ శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జియావుద్దీన్‌తో పాటు పలువురు న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

ముగిసిన వైకాపా ఎంపీపీ పోలీస్ కస్టడీ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: న్యాయవాది ఇంటిపై దాడి చేసిన కేసులో తెనాలి వైకాపా ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు పోలీస్ కస్టడీ సోమవారంతో ముగిసింది. దర్యాప్తు నిమిత్తం రెండు రోజుల పోలీస్ కస్టడీకి న్యాయమూర్తి అనుమతిస్తూ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు పోలీసులు శనివారం మధ్యాహ్నం గుంటూరు జిల్లా జైలు నుంచి తెనాలి గ్రామీణ పోలీస్‌స్టేషన్‌కు ఆయన్ని తీసుకువచ్చారు. రెండు రోజుల పాటు మధ్యవర్తుల సమక్షంలో విచారించిన తర్వాత సోమవారం తిరిగి న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చి అనంతరం గుంటూరు జిల్లా జైలుకు తరలించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీవైపీ పోటీ

మంగళగిరి టౌన్, న్యూస్‌టుడే: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత చైతన్య యువజన పార్టీ (బీసీవైపీ) రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ అన్నారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో పాటు సమగ్ర కులగణన చేపట్టాలని పార్టీ పోరాడుతుందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన 34 శాతం బీసీ రిజర్వేషన్ల అమలులో ఎలాంటి కుట్రలు, సాంకేతికత, న్యాయపరమైన సాకులు చూపినా ఉద్యమిస్తామని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 50 శాతం సీట్లు కేటాయిస్తామని, మిగిలిన స్థానాల్లో కాపులు, ఇతర అణచివేతకు గురవుతున్న వర్గాలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఇప్పటివరకు చట్టసభలకు వెళ్లని వెనుకబడిన సామాజిక వర్గాలకు ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన అనంతరం 2026, జులై 1 నాటి ఓటర్ల జాబితా ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలను వైకాపా, తెదేపా మోసం చేస్తున్నాయని ఆరోపించిన ఆయన ఎన్నికల్లో అక్రమాలను ఎదుర్కొనేందుకు పార్టీ సిద్ధంగా ఉందన్నారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి స్థానిక ఎన్నికల్లో చేసిన అరాచకాలను నేడు చంద్రబాబు తిరిగి చేయాలని చేస్తే ఊరుకునేది లేదన్నారు.

మాట్లాడుతున్న బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్. ప్రతినిధులు

ప్రత్తిపాడులో 7.8 మి.మీ వర్షపాతం

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే : జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు 1.8 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. ప్రత్తిపాడు మండలంలో 7.8, కాకుమాను 6.2, దుగ్గిరాల 3.6, చేబ్రోలు 3, పొన్నూరు 2.4, పెదనందిపాడు 2.2, కొల్లిపర 1.6, మేడికొండూరు 1.4, వట్టిచెరుకూరు 1.4, మంగళగిరి 1, గుంటూరు పశ్చిమ 1 మిల్లీ మీటర్ల మేర వాన పడింది.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 120, రిటైల్ ధర - 147, చికెన్ విత్‌స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 257.
కృష్ణా జిల్లాలో వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 228 చికెన్ స్కిన్‌లెస్ - 257.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

స్వర్ణాంధ్ర-వికసిత్ ఆంధ్ర లక్ష్యంగా పనిచేయాలి

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-వికసిత్ ఆంధ్ర లక్ష్యంగా అందరూ పని చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి కోరారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవాల సందర్భంగా సోమవారం అకడమియా ఇండస్ట్రీస్ మీట్ 2026 నిర్వహించారు. ఈ మీట్‌లో సీఐఐ, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఎఫ్ట్రానిక్స్, ఐఐటీఎం, మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, సీ డాక్, ఏరోస్పేస్ ఏవియేషన్, వస్త్ర పరిశ్రమ రంగం, మౌలిక వసతులు, టెలికాం, బ్యాంక్ ఫైనాన్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్, ఏపీ మెడిటెక్ జోన్ లిమిటెడ్‌కు చెందిన ప్రతినిధులు, అన్ని విశ్వవిద్యాలయాలకు చెందిన ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్స్ అధిపతులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 72 విశ్వవిద్యాలయాలలో లక్షల మంది చదువుకుంటున్నారని పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలను వారికి అందించడమే ఈ సదస్సు ప్రధాన లక్ష్యమన్నారు. ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య శివరామ్‌ప్రసాద్ మాట్లాడుతూ పరిశ్రమలు-విద్యాసంస్థల మధ్య ఉన్న ఖాళీని పూడ్చాల్సిన బాధ్యత పారిశ్రామికవేత్తలపై ఉందన్నారు. విశ్వవిద్యాలయాలలో పరిశ్రమలకు చెందిన వారితో విద్యాబోధన చేయిస్తే వాళ్లకు కావల్సిన విధంగా విద్యార్థులను తయారుచేసే అవకాశముందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ ఆచార్య రత్నషీలామణి తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలతో ఆచార్య మధుమూర్తి

1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఐద్వా ఆందోళన

తాడేపల్లి, న్యూస్‌టుడే: నిత్యావసర ధరల పెంపునకు నిరసనగా సెప్టెంబరు 1 నుంచి 10వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేపడుతున్నట్లు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీదేవి, వి.సావిత్రి తెలిపారు. తాడేపల్లి మండలం కొలనుకొండలోని ఐద్వా రాష్ట్ర కార్యాలయం నుంచి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
80080 03297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును: బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక దరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 73311 65666

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). ✆ 8142292071.

REAL ESTATE

GENERAL

బాపట్ల SBI నుండి అంబేద్కర్ మార్గ్ వెళ్ళే దారిలో 4 3/4 సెం||ల్లో ఉత్తరం ఫేసింగ్ గల పాత ఇల్లు అమ్మకమునకు కలదు. సంప్ర. 9885095025.

PLOT FOR SALE

GENERAL

గుంటూరు, గుజ్జనగుండ్ల సమీపంలో పెదపలకలూరు నందు CRDA అప్రూవ్డ్ రెసిడెన్షియల్ ప్లాట్స్, CC రోడ్లు, డ్రైనేజీ, కాంపౌండ్ వాల్, ఎలక్ట్రిసిటి మొ.లకు సదుపాయాలతో. బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. ✆ 7569991020.

అమరావతి రోడ్డుకు, ఇన్నర్ రింగ్‌రోడ్డుకు దగ్గరలో 700, 300 గజాల ఓపెన్ ప్లాట్ గులాబీ తోటతో సేల్. క్లియర్ టైటిల్.. స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 9010334569.

PROPERTY FOR SALE

GENERAL

446 yds house with 8 portions sheets @ mangaldas nagar. 2nd bit vja road @ land cost. ✆ 9494800160

TO LET

WANTED

మంగళగిరి నుండి 5 కిలోమీటర్ల పరిధి లో 4000 sqft గోడౌన్ కావలెను (స్టీల్ డోర్స్ మరియు విండోస్ కొరకు) ✆ 9100994692.

JOBS

WANTED
శ్రీప్రధ లూబ్స్ & పెట్రో కెమికల్స్
AP+TG తెలుగు రాష్ట్రాలకు ఇండస్ట్రియల్ మరియు కమర్షియల్ ప్రొడక్ట్స్ ముఖ్యంగా MTO, Toluene, Hexane మార్కెటింగ్ కోసం B2B సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
అనుభవం: 2 TO 8 సం||లు B2B ఇండస్ట్రియల్ సేల్స్‌లో పై ప్రొడక్ట్స్ మార్కెటింగ్‌లో అనుభవం / కస్టమర్ పరిచయాలు ఉన్నవారికి ప్రాధాన్యత.
జీతం: 30,000 to 50,000+ ఇన్‌సెంటివ్స్+TA, DA.
దరఖాస్తుకు పూర్తి బయోడేటా మరియు మిగిలిన వివరాలు పంపించగలరు.
vishpt.edu@gmail.com
ఇంటర్వ్యూ Dates: 3-9-26, 4-9-26
టైం: 9 AM to 5 PM
Venue : సన్నిధి హోటల్ NRP రోడ్డు, గాంధీనగర్, విజయవాడ.
79812 56333
99890 77477

ఆఫీసు అసిస్టెంట్ కావలెను. బికాం, 3 సం||లు కంప్యూటర్ అకౌంట్స్‌పై అనుభవం, తెలుగు, ఇంగ్లీష్ భాషలపై పరిజ్ఞానం, రెజ్యూములను kamathamjobs@gmail.com కు పంపగలరు. అర్హతను బట్టి మంచి వేతనం.

ప్రముఖ స్టార్ హోటల్ "గీతా రీజెన్సీ" నందు పనిచేయుటకు రుబ్బింగ్, కొఫ్టెన్స్, వెయిటర్స్, కిచెన్ అసిస్టెంట్స్, రూమ్ సర్వీస్ వెయిటర్స్, ఆర్డర్ టేకర్స్, హౌస్ కీపింగ్ బాయ్స్, కాఫీ స్టాల్, స్టోర్ కీపర్స్, రెస్టారెంట్ ఇంఛార్జి మరియు కన్‌స్ట్రక్షన్ సూపర్‌వైజర్స్ వెంటనే కావలెను. అనుభవమును బట్టి ఆకర్షణీయమైన జీతం. సంప్ర. 4/1, అరండల్‌పేట గుంటూరు. 9949077525.

డెలివరీ బాయ్స్ & గర్ల్స్ (పార్ట్ టైం 5-6 గం||) సంపాదన 20K to 30K. ఆఫీస్ స్టాఫ్ (ఫుల్ టైం 10 గం||) లొకేషన్ : మంగళగిరి, తాడేపల్లి, నంబూరు, చిన్నకాకాని, వడ్డేశ్వరం, కురుగల్లు, ఫోన్ : 6304669595, లొకేషన్ : సత్తెనపల్లి, పెదకూరపాడు, సాతులూరు, క్రోసూరు, రాజుపాలెం, మేడికొండూరు, ముప్పాళ్ల ✆ 7396569618

విజయవాడలోని ప్రముఖ విద్యాసంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర: 9182513039

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

వంకాయలపాడులోని ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు రెడిమిక్స్ ప్లాంట్ ఆపరేటర్ కావలెను. 2y-3y అనుభవం గలవారు సంప్ర|| 8019319415.

తెనాలి బస్టాండ్ నందు RTC బస్సులో టికెట్లు కొట్టుటకు తెనాలి పరిసర ప్రాంతాలవారు కావలెను. జీతము 8500/- సంప్ర|| సెల్: 8374256672.

పంజాబ్ నేషనల్‌బ్యాంక్ మెట్‌లైఫ్‌లో టీమ్ రిక్రూట్ చేయుటకు మేనేజర్స్ కావలెను. ఆన్‌రోల్ జాబ్ 30K + Incent. వర్క్ ఫ్రమ్ హోమ్. 9949839400, 9032592584

SECURITY GUARDS

Wanted ex army Persons to work as Security Guards at Nambur - 8331029045.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

తెనాలి

•తెనాలి • పొన్నూరు

సమస్యల పరిష్కారానికి కృషి

సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి సంక్షేమం ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సోమవారం పట్టణ 14వ వార్డులో పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పరిష్కారాలకు హామీ ఇచ్చారు. ప్రగతి, సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. నాయకులు పాల్గొన్నారు.

బుర్రిపాలెంలో ఉచిత వైద్య శిబిరం

విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న సిబ్బంది

తెనాలి టౌన్: తన కుమారుడు గౌతమ్ పుట్టిన రోజు సందర్భంగా సినీ హీరో మహేశ్‌బాబు, ఆంధ్ర హాస్పిటల్స్ సౌజన్యంతో తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామంలో సోమవారం ఏర్పాటు చేయించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విద్యార్థులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. ఆరోగ్య అవగాహన సదస్సు ద్వారా ప్రస్తుత కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. డాక్టర్ పీవీ రామారావు పర్యవేక్షణలో వైద్యులు శైలేష్, సిబ్బంది సేవలు అందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పట్టణ పరిధిలోని 23వ వార్డులో రహదారి పగుళ్లు ఇచ్చింది. మరమ్మతులు చేసే విధంగా చర్యలు చేపట్టాలి. **-పి.డేవిడ్, 23వ వార్డు.** ✔ మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. సమస్య పరిష్కరిస్తాం. **-సాయి, సహాయ ఇంజినీర్.**

? పట్టణ పరిధిలోని 2 వార్డులో చెత్త పేరుకుపోయింది. పరిసరాలు అధ్వానంగా మారడంతో ఇబ్బందిపడుతున్నాం.**-పి.శ్రీధర్, 2వ వార్డు.** ✔ చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. **-పోతురాజు, ప్రజారోగ్యశాఖాధికారి.**

స్పందన: 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పొన్నూరు పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో పాడైపోయిన వీధి దీపాన్ని బాగు చేశారు. ★ 26వ వార్డులో మురుగు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. – న్యూస్‌టుడే, పొన్నూరు.చీ

? తెనాలి మండలం కఠెవరం గ్రామం జెండా చెట్టు రోడ్డులో నెల రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. **- రవి, కఠెవరం**
✔ మరమ్మతులు చేయిస్తాం. **-దీప్తి, ఎంపీడీవో**

స్పందన: ★ తెనాలి పట్టణ బాలాజీరావుపేట, ఐతానగర్ ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదన్న ఫిర్యాదుతో స్పందించిన మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగ సిబ్బంది మరమ్మతులు పూర్తి చేసి దీపాలను వెలిగించారు. సమస్య పరిష్కరించారు. ★ తెనాలి పట్టణ సీఎం కాలనీలో భూగర్భంలోని పైపులు పగిలి తాగు నీరు వృథా అవుతుందన్న ఫిర్యాదుతో స్పందించిన మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది మరమ్మతులు పూర్తి చేసి నీటి వృథాను అరికట్టారు. – న్యూస్‌టుడే, తెనాలి టౌన్

నీటిని తోడేస్తున్నారు

పొన్నూరు, న్యూస్‌టుడే

మండల పరిధిలోని పెద్ద ఇటికంపాడు, ఉప్పరపాలెం, బ్రాహ్మణ కోడూరు, వల్లభరావుపాలెం, మాచవరం తదితర గ్రామీణ ప్రాంతాల్లో రక్షిత మంచినీటి పథకాలు ఉన్నాయి. కొంతమంది భవన యజమానులు ఇంటి వద్ద కుళాయిలను ఏర్పాటు చేసుకుని వాటికి విద్యుత్తు మోటార్లు అమర్చారు. వాటి సాయంతో ఇష్టానుసారం నీటిని తోడేస్తున్నారు. దీనివల్ల దిగువ ప్రాంతాల్లో ఉన్న కాలనీలకు తాగునీరు సరిగా సరఫరా కావడం లేదు. తాగునీరు లేక ఆయా కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. తమ దాహార్తిని తీర్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

❖ మండలం: పొన్నూరు ❖ గ్రామాలు: 29
❖ మంచినీటి పథకాలు ఉన్న గ్రామాలు: 22
❖ కుటుంబాలు: 23,400 ❖ జనాభా: 60,375 ❖ కుళాయిల సంఖ్య: 6,492

☆ శివారు ప్రాంతాల్లో కొంతమంది యజమానులు కూడా కుళాయిలకు మోటార్లు అమర్చినప్పటికీ చుక్క నీరు రావడం లేదని వారు వాపోతున్నారు. మంచినీరు రాకపోవడంతో శివారు ప్రాంతవాసులు నీటి కోసం ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. నీటిని కొనుగోలు చేసి తమ దాహార్తిని తీర్చుకుంటున్నారు. వ్యక్తిగత అవసరాల కోసమూ దూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. ప్రతి రోజూ నీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదు చేస్తే.. వస్తున్నారు.. చూసి వెళ్తున్నారు తప్ప సమస్యను పరిష్కరించే విధంగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి ఆ నీటి కుళాయిలకు అమర్చిన విద్యుత్తు మోటార్లను తొలగించే విధంగా తగు చర్యలు చేపట్టాలని గ్రామీణ ప్రాంత వాసులు కోరుతున్నారు. ☆ దీనిపై పొన్నూరు ఈవోపీఆర్డీ వేముల శ్రీనివాసరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా కుళాయిలకు అమర్చిన విద్యుత్తు మోటార్లను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వెల్లలూరులో కుళాయికి అమర్చిన విద్యుత్తు మోటారు

దేవాలయ అభివృద్ధికి ప్రాధాన్యం

శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరు, న్యూస్‌టుడే: పొన్నూరులోని భావనారాయణ స్వామి దేవాలయ అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చామని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పేర్కొన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని భావనారాయణస్వామి దేవాలయ ప్రాంగణంలో రూ. 45 లక్షలతో నిర్మించిన నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైకాపా పాలనలో దేవాలయంలో అనేక అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవాలయంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని వెల్లడించారు. దేవాలయానికి వచ్చే భక్తులకు మౌలిక వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత వైకాపా పాలనలో భావనారాయణ స్వామి గ్రంథాలయంలోని వేలాది పుస్తకాలను గుంటూరుకు తరలించడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అర్బన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ వడ్రాణం మార్కండేయ బాబు, ఆలయ అధికారి అనుపమ, డీఈ శ్రీనివాసరావు, దేవాలయ పాలక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెదకాకాని ఆలయ ప్రతిష్ఠ కాపాడాలని విజ్ఞప్తి

సమావేశంలో మాట్లాడుతున్న అర్చకులు

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలోని భ్రమరాంబ అమ్మవారి మంగళసూత్రం మాయమైన ఘటనపై కొందరు కావాలని ఇష్టానుసారం ఆరోపణలు చేస్తూ ఆలయ ప్రతిష్ఠ దిగజారేలా వ్యవహరిస్తున్నారని స్థానాచార్యుడు పొత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చకుడు పొత్తూరి లక్ష్మినారాయణ వరప్రసాద్, ఉప ప్రధాన అర్చకుడు ధనమహేశ్వర ప్రసాద్ అన్నారు. ఆలయ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళసూత్రం మాయం కావడంపై తాము తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు చెప్పారు. ఇలాంటి సమయంలో కొందరు దీనిని రాజకీయం చేసి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. అమ్మవారికి రెండేసి జతలు కంఠం వరకు ఉండే మంగళసూత్రాలు, అలంకరించే మంగళసూత్రాలు ఉన్నట్లు చెప్పారు. దురదృష్టకర ఘటన జరిగిన వెంటనే అమ్మవారికి మరొక దానిని అలంకరించినట్లు చెప్పారు. విషయం తెలుసుకోకుండా ఆరోపణలు ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆలయంలోని అర్చకులతోపాటు కుటుంబ సభ్యులు కూడా మానసికంగా కుంగిపోయినట్లు తెలిపారు. పోలీసుల దర్యాప్తు పూర్తయ్యే వరకు సంయమనం పాటించాలని సూచించారు. న్యాయపరమైన చర్యలకు తమ అర్చకలోకం కట్టుబడి ఉంటుందని వెల్లడించారు.

జెట్రోతో ఏఎన్‌యూ సంయుక్త సమావేశం

జపాన్ ప్రతినిధులతో ఇన్‌ఛార్జి వీసీ

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: జపాన్ విదేశాంగ వ్యాపార సంస్థ (జెట్రో) ప్రతినిధులు సోమవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి, విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. జెట్రో ప్రతినిధులు ఖజుమి, సీనియర్ డైరెక్టర్ కెన్ టమోరా, డిప్యూటీ డైరెక్టర్ అరుణ అశోకన్ జపాన్ బృందంలో ఉన్నారు. జపాన్ విశ్వవిద్యాలయాలు, వివిధ సంస్థలలో ఇక్కడి విద్యార్థులకు అవకాశాలు కల్పించేందుకు జెట్రో కృషి చేస్తోందని ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ తౌసీఫ్ అహ్మద్ తెలిపారు. ఇక్కడి విశ్వవిద్యాలయాలలో సదస్సులు, సమావేశాలు నిర్వహించి జపాన్‌లో ఉన్న అవకాశాలు వివరిస్తారని, ఇందులో భాగంగా సోమవారం ఏఎన్‌యూలో పర్యటించారని తౌసీఫ్ వెల్లడించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య శివరామ్‌ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో ప్రశ్నల వర్షం

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని స్వర్ణోత్సవాలలో భాగంగా బుధవారం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఉన్నతాధికారులు కమిటీలు నియమించారు. ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ అధ్యక్షతన సోమవారం కమిటీలతో సమీక్షా సమావేశం జరిగింది. రెండు రోజుల్లో సమావేశం నిర్వహిస్తుండగా ఇప్పుడు సమీక్ష ఏమిటని పలువురు సభ్యులు ప్రశ్నించారు. పూర్వ విద్యార్థుల కోసం నిర్వహించే ఈ సమావేశంలో వారికి ఎందుకు ప్రాధాన్యత ఇవ్వలేదని నిలదీశారు. స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలలో కొంతమందికే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపణలు చేశారు. సీనియర్ ఆచార్యులు ఒకరు తనకు కమిటీలో ఎందుకు స్థానం కల్పించలేదని ప్రశ్నించారు. పూర్వ విద్యార్థుల సమావేశానికి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఎందుకు నియమించలేదని నిలదీశారు. పూర్వ విద్యార్థుల సమావేశం కోసం ఆయా విభాగాలకు కేటాయించిన డబ్బులు ఇంకా అందలేదని తెలిపారు. అన్ని విభాగాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదని, పూర్వ విద్యార్థులు వచ్చే సమయంలో ఇలా ఉంటే ఎలా అని అడిగారు.

'జీతాల పెంపు బాధ్యత వీసీలదే'

రిలే దీక్షలో ఒప్పంద అధ్యాపకులు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: యూజీసీ వేతనాలు అమలు చేయాలని కోరుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఒప్పంద అధ్యాపకులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారంతో 36వ రోజుకు చేరుకున్నాయి. ఉన్నత విద్యాశాఖ కమిషనర్ భరత్‌గుప్తాను కలిసిన ఒప్పంద అధ్యాపకులు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జీతాలు పెంచే బాధ్యత వీసీలదేనని భరత్‌గుప్తా చెప్పారని ఒప్పంద అధ్యాపకులు తెలిపారు. జీతాలు పెంచేందుకు ఈసీ అనుమతి, ఇతర జీవోలు ఉన్నందున వాటి అమలుపై వీసీలతో చర్చించాలని ఆయన సూచించినట్లు ఒప్పంద అధ్యాపకులు వెల్లడించారు. మంగళవారం ఏఎన్‌యూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్‌ను కలిసి జీతాల పెంపుపై స్పష్టత తీసుకుంటామని వివరించారు.

విద్యుత్తు అంతరాయాలు నివారించారు

పట్టణ నాజరుపేట సంకావారి కొట్ల బజారులో విద్యుత్తు తీగలపైకి చెట్టు వాలిన క్రమంలో తరచూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతున్న వైనాన్ని తెలియజేస్తూ ఈనాడులో ఆగస్టు 17వ తేదీన 'సరిచేస్తే సరి' శీర్షికతో చిత్రవార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ప్రమాదకరంగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించి తీగలను సరి చేసి విద్యుత్తు అంతరాయాలను నివారించారు. ★ మురుగు పారుదలకు **చర్యలు:** మారీసుపేట వంతెన కింద భాగంలో కాలువల్లో మురుగు పారుదల లేని తీరును తెలియజేస్తూ ఈనాడులో ఆగస్టు 16వ తేదీన 'మురుగు తొలగించండి సారూ' శీర్షికతో చిత్రవార్త ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ సిబ్బంది పూడికలను తొలగింప చేసి మురుగు పారుదల సమస్యను పరిష్కరించారు. – న్యూస్‌టుడే, తెనాలిటౌన్

సేవలు స్ఫూర్తిదాయకం

ప్రసంగిస్తున్న రోటరీ జిల్లా గవర్నర్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ప్రజల అవసరాలను గుర్తించి వారికి మేలు చేసేలా కార్యక్రమాలు నిర్వహించడంలో రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ముందంజలో ఉందని రోటరీ జిల్లా గవర్నర్ ఉదయ్‌సుధీర్ పిలానీ పేర్కొన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు, అంగన్వాడీ కేంద్రాలకు ఉపకరణాలు అందించారు. విరాళాలు అందించిన నాగయ్య, మౌనిక, సరోజ్‌బాబును అభినందించారు. అధ్యక్ష, కార్యదర్శులు సరోజ్‌బాబు, కొల్లి రాజేంద్రప్రసాద్, జంగాల వెంకటేష్, గుత్తా వెంకటరత్నం, కన్నెగంటి మురళీకృష్ణ, ఈదర వెంకటపూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ పరీక్షలా.. అయితే వెళ్లిపోండి

త్రీఫేజ్ కనెక్షన్ లేక ప్రారంభంకాని సేవలు

న్యూస్‌టుడే, తెనాలి (కొత్తపేట)

ఆలపాటినగర్‌లోని యూపీహెచ్‌సీ భవనం

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవల విషయంలో కొంత జాప్యం ఏర్పడుతోంది. ఆయా ఆసుపత్రుల్లో ఏమైనా సమస్యలు ఉంటే ఉన్నత అధికారులు వాటిని సత్వరం పరిష్కరించాల్సి ఉంది. కాకపోతే వాస్తవానికి అలాంటి పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు. పట్టణ పరిధిలోని ఆలపాటినగర్ యూపీహెచ్‌సీలో ఓ సమస్య పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీనివల్ల అక్కడికి వచ్చే రోగులు, ఆసుపత్రి సిబ్బంది ఇబ్బందిపడుతున్నారు.

★ ఆలపాటి నగర్‌లో యూపీహెచ్‌సీ నిర్మించేందుకు గత ప్రభుత్వ హయాంలో కేంద్రం రూ.80 లక్షల నిధులు మంజూరు చేసింది. మున్సిపల్ అధికారులు ఈ ఏడాది దాని నిర్మాణ పనులు పూర్తి చేశారు. మంత్రి నాదెండ్ల మనోహర్ దానిని ప్రారంభించారు. ఆసుపత్రి ప్రారంభమైన మరుసటి రోజు నుంచే ఇక్కడికి రోగులు క్యూ కట్టారు. వారికి పరీక్షలు చేద్దామని చూడగా ల్యాబ్‌కు త్రీఫేజ్ కరెంటు వసతి లేదనే విషయాన్ని గుర్తించారు. పురపాలక అధికారుల దృష్టికి విషయం తీసుకువెళ్లినా ఫలితం మాత్రం రాలేదు. దీంతో మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వైద్యులు పాల్గొని త్రీఫేజ్ విద్యుత్తు వసతితోపాటు పలు సమస్యలపై అర్జీ ఇచ్చారు. ఏపీసీపీడీసీఎల్ వారితో చర్చించి త్రీఫేజ్ సదుపాయం కల్పిస్తామని మున్సిపల్ అధికారులు బదులిచ్చారు. అర్జీ అందించి సుమారు 50 రోజులు దాటినా పరిష్కారం మాత్రం లేదు. త్రీఫేజ్ కనెక్షన్ లేకపోవడం వల్ల ల్యాబ్‌లో పరీక్షలు చేయడం వీలుపడడం లేదని వైద్యులే స్వయంగా రోగులకు తెలియజేస్తున్నారు. అత్యవసరమైతే జిల్లా ఆసుపత్రికి పంపిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్రీఫేజ్ కరెంటు వసతిని కల్పించి ల్యాబ్ పరీక్షలు జరిగేలా చూడాలని రోగులు కోరుతున్నారు.

క్రీడాకారులకు అభినందన

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: భూటాన్‌లో ఆగస్టు 24వ తేదీ నుంచి 27 వరకు జరిగిన అంతర్జాతీయ గోల్ షాట్ బాల్ పోటీల్లో తమ విద్యార్థులు భారత జట్టు తరఫున పాల్గొని సత్తా చాటారని సెయింటాన్స్ పాఠశాల యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. సబ్ జూనియర్స్ బాలికలు, బాలుర విభాగంలో ప్రజ్ఞా, అమూల్య, జశ్విత, జాయల్, రిత్విక్ కిరణ్, సుహాస్, హర్షద్ గౌతమ్ పాల్గొన్నారని తెలిపారు. ఈ పోటీల్లో భారత్, భూటాన్, నేపాల్, శ్రీలంక, మయన్మార్ జట్లు పాల్గొన్నాయని పేర్కొన్నారు. పోటీలకు హాజరై తిరిగి వచ్చిన విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు వినోద్‌కుమార్, శ్రీనివాస్‌లను సోమవారం పాఠశాలలో అభినందించారు.

సందడిగా క్రీడా పోటీలు ప్రారంభం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: బుర్రిపాలెం రోడ్డులోని వివేకానంద సెంట్రల్ స్కూల్‌లో సోమవారం చిన్నారుల క్రీడా పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ రావిపాటి వీరనారాయణరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో శాప్ పూర్వ డైరెక్టర్ జి.గోపిచంద్, బొమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి, నల్లూరి వెంకటేశ్వరరావు, గుత్తా వెంకటరత్నం అతిథులుగా హాజరయ్యారు. స్కేటింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన గౌతమ్, జెస్సీ, హారిక, శ్రీరామ్‌కు పతకాలు, ధ్రువపత్రాలు అందించి అభినందించారు. తొలి రోజు పరుగు, బాస్కెట్ బాల్, త్రో బాల్ తదితర క్రీడలు నిర్వహించారు. మంగళవారం కూడా పోటీలు కొనసాగనున్నాయి.

బహుమతులు అందుకున్నవారితో నిర్వాహకులు

మేనేజ్‌మెంట్ మీట్ 2026 పోస్టర్ ఆవిష్కరణ

కార్యక్రమంలో ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్, ప్రతినిధులు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవాలలో భాగంగా ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించే మేనేజ్‌మెంట్ మీట్ 2026 పోస్టర్‌ను ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ ఆవిష్కరించారు. రూసా 2.0 సహకారంతో ఈ సదస్సును నిర్వహించనున్నారు. విద్యార్థులలో నాయకత్వ లక్షణాల పెంపు, నిర్వహణ నైపుణ్యాలు, సృజనాత్మకత, బృంద స్ఫూర్తిని పెంచే లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేసినట్లు ఆచార్య గంగాధర్ తెలిపారు.

విజ్ఞాన్స్ కులపతికి అరుదైన గౌరవం

పొన్నూరు: చేబ్రోలు మండల పరిధిలోని వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ కులపతి పావులూరి సుబ్బారావుకు ఆస్ట్రో నాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రతిష్ఠాత్మక డిస్టింగ్విష్డ్ ఫెలో అందించినట్లు ఉపకులపతి కేవీ.కృష్ణ కిషోర్ సోమవారం వెల్లడించారు. ఏరోస్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధికి ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి ఈ గౌరవాన్ని ప్రదానం చేసినట్లు తెలిపారు.

దివ్యాంగుల పింఛను మంజూరు చేయండి

అర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ రామ అప్పలనాయుడు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: మురుగుకాలువలో పూడిక తీయక దుర్వాసన వ్యాపిస్తుందని, సర్వే చేయించాలని, దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని అర్జీదారులు మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పలనాయుడును కోరారు. సోమవారం పట్టణ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీదారులు సమస్యలపై సమర్పించిన అర్జీలను ఆయన స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి ఆయా శాఖాధికారులతో మాట్లాడతానని తెలిపారు.

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ఆరు అర్జీలు అందాయి. ఆర్డీవో కె.శ్రీరమణి అర్జీదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కారాలకు హామీ ఇచ్చారు. తమకు ఉద్యోగోన్నతి కల్పించాలని తెనాలి డివిజన్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘ ప్రతినిధులు అర్జీ అందించారు. ఐతానగర్‌లోని చర్చి విషయంగా నెలకొన్న వివాదాన్ని పరిష్కరించాలని, రికార్డులు పరిశీలించి దురాక్రమణను అడ్డుకుని, సంబంధితులపై చర్యలు తీసుకోవాలని పలువురు వినతి పత్రం ఇచ్చారు. గ్రామంలో మద్యం బెల్టు దుకాణాలు, ఇతర సమస్యలపై మొత్తం మూడు అర్జీలను తహసీల్దార్ గోపాలకృష్ణ తన కార్యాలయంలో స్వీకరించారు. అధికారులు పాల్గొన్నారు.

రిఫరీ శిక్షణ పూర్తి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలికి చెందిన చిన్నా మాస్టర్ విజయవాడలో ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన రిఫరీ శిక్షణ శిబిరంలో పాల్గొని విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సినీ నటుడు సుమన్ ఆయనకు ధ్రువపత్రం, జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా పలువురు గురువులు అభినందనలు తెలిపారు.

2న జనసేన ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబరు 2వ తేదీన తెనాలిలో భారీ ప్రదర్శన, యువజన విభాగ ఆవిష్కరణ, సేవా కార్యక్రమాలకు సన్నాహాలు చేస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ మేరకు తెనాలిలోని కార్యాలయంలో సోమవారం సమావేశమై కార్యాచరణపై చర్చించారు.

పాస్టర్లకు బియ్యం బస్తాల పంపిణీ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ది తెనాలి టౌన్ పాస్టర్స్ గ్రేట్ సపోర్ట్, ఫుల్ హెల్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు బ్రదర్ ఆనందన్న సోమవారం పాస్టర్లకు బియ్యం బస్తాలను అందించారు. సంఘ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

తెనాలి ఇన్‌ఛార్జి ఏజీపీగా వట్టికూటి

పొన్నూరు, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని వైష్ణవీనగర్‌కు చెందిన సీనియర్ న్యాయవాది వట్టికూటి లీలా ప్రసాద్‌ను తెనాలిలోని సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు ఇన్‌ఛార్జి ఏజీపీగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ప్రస్తుతం పొన్నూరు ఏజీపీగా కొనసాగుతున్నారు.

వ్యాపారిని కిడ్నాప్ చేసింది కిరాయి ముఠానే

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: గతంలో విజయవాడ, రెండేళ్లుగా తెనాలిలో నివాసం ఉంటున్న వ్యాపారి నాగవీరయ్య అదృశ్యం కేసులో మిస్టరీ క్రమంగా వీడుతోంది. ఆదివారం వ్యాపారి భార్య, బంధువులు, సహజీవనం చేస్తున్న మహిళ, ఆమె బంధువులను పోలీసులు విచారించారు. తమకు లభించిన క్లూస్ ఆధారంగా సీఐ నాయబ్‌రసూల్, ఎస్సైలు ఆనంద్, ప్రసాద్ పర్యవేక్షణలో మూడు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. నంబరు ప్లేటు లేని కారు గురించి ఆరా తీశారు. సీసీ కెమెరాలను పరిశీలించారు. వ్యాపారిని ఎక్కించుకున్న కారు రేపల్లె మార్గంలోకి వెళ్లిందని గుర్తించారు. ఆస్తి వివాదాల నేపథ్యంలో నాగవీరయ్య బంధువే భట్టిప్రోలు ప్రాంతానికి చెందిన కిరాయి ముఠాతో అతడిని కిడ్నాప్ చేయించినట్లు విచారణలో తేలిందని సమాచారం. నిందితుల్లో కొంతమందిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. వ్యాపారి ఆచూకీ ఇంకా లభించని నేపథ్యంలో కిరాయి ముఠా అతడిని ఏదైనా చేసిందా? అన్న కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: రైలు నుంచి జారిపడి మృతి చెందిన అనాథ మృతదేహానికి రైల్వే పోలీసుల సూచనలతో శ్రీశివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. అధ్యక్షుడు కుర్రా శ్రీను, పోతురాజు, సంజయ్, అబ్రహం సేవలు అందించారు.

విషాదానికి రెండేళ్లు.. అమలుకాని హామీ

ఉప్పలపాడు మురుగు కాలువపై ప్రారంభంకాని వంతెన పనులు

పెదకాకాని, న్యూస్‌టుడే

ప్రమాదం జరిగిన ప్రాంతమిదే

ఉప్పలపాడు శివారులోని మురుగు వాగు చప్టాలో కారు కొట్టుకుపోయి ముగ్గురు ప్రాణాలు కోల్పోయిన ఘటనకు మంగళవారంతో రెండేళ్లు అవుతుంది. ఈ ఘటన మూడు కుటుంబాల్లో విషాదం నింపింది. మురుగువాగుపై వంతెన నిర్మిస్తామని అధికారులు హామీ ఇచ్చి రెండేళ్లు అవుతున్నా అమలు మాత్రం జరగలేదు. వర్షాలు కురిసినప్పుడల్లా వాగులో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని గ్రామస్థులు భయపడుతున్నారు.

మూడు కుటుంబాల్లో విషాదం..: ఎర్రబాలెంకు చెందిన రాఘవేంద్ర(40) నంబూరు వివా స్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉప్పలపాడులో అద్దె ఇంట్లో నివాసం ఉండేవారు. ఉప్పలపాడు గ్రామానికి చెందిన కోడూరి శ్రీధర్, శిల్పవేణి దంపతుల కుమారుడు మాన్విక్(9) స్థానిక అమ్మమ్మ, తాతయ్య నాయకమ్మ, సూర్యనారాయణ వద్ద ఉంటూ వివా స్కూల్‌లో నాలుగో తరగతి, ఇదే గ్రామానికి చెందిన వెంకట బాలసుబ్రహ్మణ్యం, ఉమాదేవి దంపతుల కుమారుడు శౌరిష్ (8) అదే స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్నాడు. 2024 ఆగస్టు 31న రోజూలాగే ఉదయాన్నే పిల్లలు పాఠశాలకు బస్సులో వెళ్లారు. ఆరోజు భారీ వర్షం కురవడంతో మధ్యాహ్నం నుంచి పాఠశాలకు సెలవు ప్రకటించారు. ఈక్రమంలోనే ఉపాధ్యాయుడు రాఘవేంద్ర, ఇంటి దగ్గర దింపుతానని పిల్లలిద్దరినీ కారులో ఎక్కించుకున్నారు. వాగులో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో అక్కడికి చేరుకున్న రాఘవేంద్ర, వరద నీటిని అంచనా వేయకుండా కారును ముందుకు నడిపారు. నీటి ప్రవాహానికి కారు వాగులోకి కొట్టుకుపోయింది. స్థానికులు వెంటనే వాగులోకి దిగి తాళ్ల సహాయంతో కారును ఒడ్డుకు చేర్చారు. అప్పటికే కారులోని వారంతా మృతి చెందారు. దీంతో ఈ ఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ప్రభుత్వం సైతం పరిహారం ప్రకటించింది.

శంకుస్థాపన చేసినా ఫలితం లేదు: ఉప్పలపాడు శివారులో వాగుపై వంతెన నిర్మించేందుకు ఏడాది క్రితం రూ.కోటికి పైగా నిధులు మంజూరయ్యాయి. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పనులు ప్రారంభించేందుకు గతేడాది శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ పనులు చేపట్టేందుకు సామగ్రిని వాగు వద్దకు తీసుకువచ్చాడు. ఏమైందో ఏమో ఇప్పటి వరకు ఎలాంటి పనులు ప్రారంభించలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.





(c) eenadu

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

నేడు వట్టిచెరుకూరులో కృతజ్ఞతా సభ

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: వట్టిచెరుకూరు గ్రామ కంఠాన్ని నిషేధిత జాబితా నుంచి తొలగించడంతో 515 మందికి తమ ఇళ్లపై హక్కులు లభించాయి. వీరందరికీ ఇళ్ల పట్టాల పంపిణీ చేయనున్నారు. వట్టిచెరుకూరులో మంగళవారం నిర్వహించే ఈ కృతజ్ఞతా సభలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు అనగాని సత్యప్రసాద్, కందుల దుర్గేష్, రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, కలెక్టర్ సాయికాంత్ వర్మ పాల్గొంటారు. సభా వేదిక ఏర్పాట్లు సోమవారం రాత్రికి పూర్తయ్యాయి. వర్షం కురిసినా ఆటంకం కలగని విధంగా సమావేశ ప్రాంగణం, ప్రముఖులు కార్లలో వెళ్లేందుకు రహదారి స్థానికులు నిర్మించారు. గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసాచార్యులు, ఈవోపీఆర్డీ జ్యోతి ఏర్పాట్లు పరిశీలించారు. ఇదే వేదికపై వృద్ధులకు పింఛన్లు అందిస్తారు.

వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలపై ఉండాలి

భక్తులకు అన్నవితరణ చేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరురూరల్: వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు నిత్యం ప్రత్తిపాడు ప్రజలపై ఉండాలని ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. గుంటూరు రూరల్ మండలం లాలుపురం గ్రామంలో సోమవారం వేంకటేశ్వరస్వామి తిరునామ శంఖు చక్రాల ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ స్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని, ప్రతి గ్రామంలో శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ తల్లి పేరుతో మొక్కలు నాటాలి

మొక్కకు నీరు పోస్తున్న కల్నల్ ఉదయ్‌కుమార్

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు తల్లి పేరుతో మొక్కను నాటి సంరక్షించడం ద్వారా తల్లి ప్రేమతో పాటు ప్రకృతిపై బాధ్యతను చాటుకోవచ్చని ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. కళాశాలలో సోమవారం 'తల్లి పేరుతో ఒక మొక్క' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. విద్యార్థులు నాటే ప్రతి మొక్క భవిష్యత్తు తరాలకు అందించే పచ్చని కానుకగా నిలుస్తుందన్నారు. 22ఏ బెటాలియన్ ఎన్‌సీసీ కమాండర్ కల్నల్ ఎ.ఉదయ్‌కుమార్ మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపల్ కొల్లా శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటపాలెంలో ఆలయ పనుల పరిశీలన

తుళ్లూరు: వెంకటపాలెంలో తితిదే ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వెంకటేశ్వరస్వామి ఆలయం రెండో ప్రాకారం, నాలుగు గాలి గోపురాల నిర్మాణ పనులను తితిదే జేఈవో ఎ.భరత్ సోమవారం పరిశీలించారు. గడువు లోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఆలయ సూపరింటెండెంట్ మల్లికార్జున పాల్గొన్నారు.

కాట్రపాడులో తిరునాళ్ల ప్రారంభం.. కాట్రపాడు(వట్టిచెరుకూరు): కాట్రపాడులో అద్దంకమ్మ, కట్టాలమ్మలకు శ్రావణమాసం పొంగళ్ల తిరునాళ్ల సోమవారం ప్రారభమైంది. అద్దంకమ్మ, కట్టాలమ్మ, బొడ్రాయి, మహాలక్ష్మమ్మ చెట్టుకు భక్తులు నీరు వార పోసి ప్రారంభ పూజలు నిర్వహించారు.

పారిశుద్ధ్య కార్మికులకు పూర్తి జీతం ఇవ్వాలి

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పూర్తి జీతం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ప్రత్తిపాడు తహసీల్దారు కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులతో కలిసి సోమవారం నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దారు కె.వెంకటేశ్వరరావుకు అర్జీ ఇచ్చారు. కార్మికుల శ్రమకు తగిన ప్రతిఫలం ఇవ్వకుండా మేస్త్రీ చేతివాటం చూపిస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు జీతాలు పెండింగ్‌లో ఉండడం, జీతాలు ఇప్పటివరకు సగమే ఇస్తున్నారని అర్జీలో పేర్కొన్నారు. కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, సీఐటీయూ మండల అధ్యక్షురాలు జ్యోతి, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

చౌక బియ్యం పక్కదారి

రోజూ లారీల్లో భారీగా తరలింపు

విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న బియ్యం (పాతచిత్రం)

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో చౌక బియ్యం పక్కదారి పడుతోంది. రోజూ తెల్లవారు జామున మూడు గంటల సమయంలో వట్టిచెరుకూరు నుంచి లారీల్లో రేషన్ బియ్యం దూర ప్రాంతాలకు ఎగుమతి అవుతోంది. గ్రామాల్లో ప్రభుత్వ చౌకధర దుకాణాల నుంచి పేదలకు అందిన బియ్యాన్ని దళారులు అక్రమ మార్గంలో సేకరించి నిల్వ చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో కొందరు మార్పులు వీటికి రసాయనాలు పిచికారీ చేసి తెల్లని ఆకర్షణీయంతమైన బియ్యంగా మార్చి సంచుల్లో నింపుతున్నారు. వీటిని లారీల్లో నింపి దూర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. వీటిలో ఎక్కువ మొత్తంలో గుంటూరు, పొన్నూరు ప్రాంతాలకు వెళ్తున్నాయి.

ప్రత్తిపాడు, కాకుమాను, పెదనందిపాడు వంటి మండలాల్లో సేకరించిన బియ్యాన్ని వట్టిచెరుకూరు మండలానికి తరలిస్తున్నారు. అనంతవరప్పాడుకు బియ్యం నిల్వలు చేరుకున్నాక, అక్కడి నుంచి భారీ వాహనాల్లో ఎగుమతి అవుతున్నాయి. ప్రతి రోజూ టన్నులకొద్దీ బియ్యం అక్రమ మార్గంలో దూర ప్రాంతాలకు వెళుతోంది. ఈ అక్రమాన్ని నియంత్రించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటంతో ఇక్కడ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. రాయితీ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ అధికారులు తనిఖీలు చేపడితే అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని, తద్వారా చౌక బియ్యం దారి మళ్లించకుండా చూడవచ్చని అంటున్నారు.

40 శాతం లోటు వర్షపాతం నమోదు

శాస్త్రవేత్తలు, అధికారులతో చర్చిస్తున్న మనజీర్ జిలాని సమూన్, పద్మావతి

మేడికొండూరు, న్యూస్‌టుడే: ఎల్‌నినో నేపథ్యంలో ఈ-పంట నమోదు చేయించుకుంటే ప్రభుత్వ పథకాలు, పంటల బీమా పొందేందుకు అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ సంచాలకుడు మనజీర్ జిలాని సమూన్ పేర్కొన్నారు. మేడికొండూరు మండలంలో పత్తి పంటను క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 40 శాతం లోటు వర్షపాతం నమోదైందన్నారు. వాతావరణ ఆధారిత పంటల బీమాలో పంట నమోదు కీలకమన్నారు. పంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రైతులకు సూచనలు, సలహాలు అందించాలని శాస్త్రవేత్తలు, అధికారులకు సూచించారు. గ్రామంలోని రైతులతో మాట్లాడగా.. సమస్యలను ఏకరవు పెట్టారు. తొలకరిలో కురిసిన కొద్దిపాటి వానలకు పత్తి, పసుపు వేశామని, తర్వాత వర్షాలు సరిగా పడలేదన్నారు. భూమిలో తేమ శాతం తగ్గడం, చీడపీడల దెబ్బకు పత్తి, పసుపు మొక్కలు ఎండుముఖం పట్టి పైరు ఎదగడం లేదన్నారు. తర్వాత ఎన్నిసార్లు పత్తి విత్తనాలు నాటినా బతకడం లేదన్నారు. పత్తిలో పూత సైతం రాలిపోతుందన్నారు. మిరప విత్తనాలు కొనుగోలు, నారు పెంచేందుకు రూ.వేలల్లో ఖర్చయిందని, నీరు విడుదల చేయకపోవడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదన్నారు. గతంలో పలు కారణాలతో పంటల బీమా నగదు అందరికీ సక్రమంగా అందలేదని, ఈసారైనా అందరికీ అందించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి, ఏవో లక్ష్మి, శాస్త్రవేత్తలు రాజేష్ చౌదరి, మహాలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

డబ్బులు అడిగితే చర్యలు తప్పవు

పెదనందిపాడు, న్యూస్‌టుడే: రోగులతో మర్యాదగా మెలగాలని డీఎంహెచ్‌వో కె.విజయలక్ష్మి తెలిపారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో సోమవారం జరిగిన వైద్యారోగ్య సిబ్బంది సమావేశంలో ఆమె మాట్లాడారు. వైద్యులు అందుబాటులో ఉండాలని చెప్పారు. రోగులకు అవసరమైన మందులు ఎప్పటికప్పుడు ఇవ్వాలని సూచించారు. సేవలందించినందుకు డబ్బులడిగితే చర్యలు తప్పవన్నారు. వైద్యులు నందకుమార్, ప్రియంవద, సీహెచ్‌వో ప్రసాదస్వామి, పర్యవేక్షకుడు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి లోకేశ్

మంగళగిరి, మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: తెదేపా అధికార ప్రతినిధి అప్పసాని రాజేష్ కుమారుడి వివాహ రిసెప్షన్‌కు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొని నూతన దంపతులు నాగ సత్యేంద్ర, స్రవంతిలను ఆశీర్వదించారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిత

జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి, సురేష్, షాయిల్ బత్రా, ఈడీ తిలక్‌బాబు, సంజయ్

మేడికొండూరు, న్యూస్‌టుడే: చదువులో రాణిస్తే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఇన్ఫోసిస్ మేనేజింగ్ డైరెక్టర్ నర్రా సురేష్ తెలిపారు. ఎన్ఆర్ఐటీ కళాశాలలో మొదటి ఏడాది విద్యార్థులకు సంబంధించి తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రారంభ్-2026 కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సురేష్ మాట్లాడుతూ సమాజంలో ఇంజినీరింగ్ పాత్ర ఎంతో ఉందన్నారు. ఆంగ్లం మాట్లాడటంలో విద్యార్థులు పట్టు సాధించాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రస్తుతం నాలుగేళ్లు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సూచించారు. ఎమ్మెల్సీ, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్య జ్ఞానం పెంచుతుందన్నారు. జీవితంలో లక్ష్యం పెట్టుకుని ప్రతి ఒక్కరూ ఆ దిశగా కృషి చేయాలన్నారు. ఎంటీఎక్స్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ షాయిల్ బత్రా మాట్లాడుతూ భవిష్యత్తులో ఏఐ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తుందన్నారు. నైపుణ్యం పెంచుకుంటే ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు తేలికగా సాధించవచ్చన్నారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్‌బాబు మాట్లాడుతూ భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని కళాశాలలో ఉత్తమ విద్య అందిస్తున్నామన్నారు. ప్రిన్సిపల్ సంజయ్ కళాశాల ప్రస్థానం, సాధించిన విజయాలు, ఎన్ఆర్ఐటీ సంస్థ సేవా కార్యక్రమాలను వివరించారు. ప్రిన్సిపల్ శ్రీహరిరావు, అధ్యాపకులు మాట్లాడారు. అనంతరం సురేష్, షాయిల్ బత్రాలను సన్మానించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

భారీ వాహనాలతో ట్రాఫిక్ చిక్కులు

మంగళగిరి నుంచి తెనాలి రోడ్డులోని మిద్దె సెంటర్‌లో సోమవారం మధ్యాహ్నం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సుమారు అర గంటకు పైగా ట్రాఫిక్ స్తంభించింది. భారీ వాహనాలకు పగలు అనుమతి లేనప్పటికీ ఇష్టారాజ్యంగా రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఎండలో ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడంతో రోజూ ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ట్రాఫిక్ నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, మంగళగిరి గ్రామీణం**

వాకింగ్ ట్రాక్ ఏర్పాటు పనుల్లో గందరగోళం

మేడికొండూరు: పేరేచర్లలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు పనులు గందరగోళంగా మారాయి. గ్రామస్థులు కొందరు పనులు ఆపాలని అడ్డుకోవడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసులు జోక్యం చేసుకోవడంతో విషయం సద్దుమణిగింది. పేరేచర్ల పంచాయతీ కార్యాలయం వెనుక ఊర చెరువు చుట్టూ అధికారులు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దాని చుట్టూ ప్రహరీ కట్టేందుకు పనులు మొదలుపెట్టారు. పక్కనే గుడి ఉండటంతో ఆలయ కమిటీ సభ్యులు వచ్చి ప్రహరీ కడితే గుడి దెబ్బతినే ప్రమాదం ఉందని, దూరంగా కట్టాలని డిమాండ్ చేశారు. పనులు పూర్తిగా ఆపేయాలని సభ్యులు భైఠాయించారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళనకారులను స్టేషన్‌కు తరలించి కొద్దిసేపటికి వదిలిపెట్టారు.

వినాయక వ్రతకల్పం పుస్తకాల ఆవిష్కరణ

పుస్తకాలు ఆవిష్కరిస్తున్న సునీల్‌కుమార్, బోర్డు సభ్యులు

మంగళగిరి టౌన్, న్యూస్‌టుడే: వినాయక చవితి సందర్భంగా శ్రీలక్ష్మీ నారాయణ సేవాసమితి ఆధ్వర్యంలో రూపొందించిన వినాయక వ్రతకల్పం పుస్తకాలను మంగళగిరి శ్రీలక్ష్మీ నరసింహుని ఆలయం వద్ద సహాయ కమిషనర్ కోగంటి సునీల్ కుమార్ సోమవారం ఆవిష్కరించారు. వినాయక చవితి సందర్భంగా భక్తులకు ఉచితంగా వీటిని పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సేవా సమితి కార్యదర్శి ఫణిదపు శ్రీనివాసరావు, ట్రస్టు బోర్డు సభ్యులు బళ్ల ఉమామహేశ్వరరావు, భీమవరపు శేషిరెడ్డి, మాజేటి కృష్ణకుమారి, మేకల మోహనరావు, కె.పూర్ణ చంద్రరావు, వీర వెంకట సత్యనారాయణ, భక్త బృందం సభ్యులు మాజేటి వేణుగోపాలకృష్ణ శ్రేష్ఠి, రుద్రు శ్రీనివాసరావు, ఆలేటి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుండిమెడలో ఆలయ భూములకు రక్షణ

ఏర్పాటు చేసిన బోర్డు వద్ద దేవాదాయ శాఖ అధికారులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి మండలం గుండిమెడలో సుమారు రూ.30 కోట్ల విలువైన ఆలయ భూముల రక్షణకు దేవాదాయ శాఖ చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఆయా భూముల్లో సోమవారం సాయంత్రం ఆ శాఖ అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు. భూమికి సంబంధించి ఎటువంటి చర్యలు చేపట్టినా శిక్షార్హులని గుండిమెడ ధర్మాదాయ సింగిల్‌ట్రస్ట్ ఏర్పాటు చేసిన బోర్డులో వివరాలు పొందుపర్చారు. ఆర్ఎస్ నంబరు 260/1లో 1.71 ఎకరాలు, ఆర్ఎస్ నంబర్ 260/2లో 98 సెంట్ల భూమికి సంబంధించి పెదకాకానిలోని ఏపీ ఎండోమెంట్స్ ట్రైబ్యునల్ కోర్టులో ఈ వ్యవహారం నడుస్తోంది. ఒ.ఎ. నంబరు 13/2024 కేసు పెండింగ్‌లో ఉందని ఆ శాఖ అధికారులు బోర్డులో పొందుపర్చారు. ట్రైబ్యునల్ కోర్టులో ఉన్న భూమిని విక్రయించేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు ఆ భూమిలో బోర్డు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. సింగిల్ ట్రస్టీ ప్రమీలారాణి, నూతక్కి గ్రూపు దేవాలయాల ఈవో పి.విజయలక్ష్మి, వడ్డేశ్వరం గ్రూపు దేవాలయాల ఈవో జె.సాయివిశ్వనాథ్, ఈవోలు భానుశ్రీ (బేతపూడి గ్రూపు దేవాలయాలు), ఈవో ఎం.ఉమామహేశ్వరరావు(సీతానగరం గ్రూపు), బి.శ్రీనివాససింగ్ (దుగ్గిరాల గ్రూపు) తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు సాగర్ జలాలు విడుదల

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలో తాగునీటి ఎద్దడి నివారణకు పెదనందిపాడు బ్రాంచి కెనాల్ ద్వారా సాగర్ జలాలు విడుదల చేసినట్లు సాగర్ కాల్వ ఈఈ మురళీధర్ తెలిపారు. పెదనందిపాడు బ్రాంచి కెనాల్ డీసీ ఛైర్‌పర్సన్ కల్లూరి కుసుమ ఆధ్వర్యంలో 250 క్యూసెక్కుల నీటిని సోమవారం విడుదల చేశారు. ఈసందర్భంగా ఈఈ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితుల వల్ల రానున్న రోజుల్లో తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందన్నారు. అందువల్ల తాగునీటి అవసరాల కోసం ముందస్తుగా నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. పెదనందిపాడు, కాకుమాను, ప్రత్తిపాడు మండలాల్లోని 30 గ్రామాల మంచి నీటి చెరువులను సాగర్ జలాలతో నింపాలని డీసీ ఛైర్‌పర్సన్ కుసుమ పంచాయతీ అధికారులను కోరారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి శ్రీనివాసరావు, డీఈ మల్లికార్జునరావు, ఏఈలు చిన్నీరాణి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వరరావు సేవలు ఎనలేనివి

తుళ్లూరు: అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్)లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పని చేస్తున్న కల్లూరి బసవేశ్వరరావు సోమవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా సోమవారం అమరావతిలోని ఏడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో జరిగిన పదవీ విరమణ అభినందన సభలో అధికారులు, ఉద్యోగులు బసవేశ్వరరావు దంపతులను సన్మానించి అభినందనలు తెలిపారు.

రెండేళ్ల పాలనపై సంతృప్తి

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: కూటమి రెండేళ్ల పాలనపై ప్రజలంతా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెదేపా మండల అధ్యక్షుడు గింజుపల్లి శివ రామప్రసాద్ తెలిపారు. ప్రత్తిపాడులో జెట్టిమిట్ట ప్రాంతంలో రెండేళ్ల నమ్మకం- కూటమి ప్రభుత్వ విజయాలపై ఇంటింటి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్రంలో అందించిన సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీ గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కాసు పెంటారెడ్డి, నాయకులు కాకాని సురేశ్‌బాబు, బోలే శ్రీనివాసరావు, కోటపాటి సదాశివరావు, గోరిజవోలు వెంకటేశ్వరరావు, మార్తల గోపి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ నోటీసులివ్వండి

తుళ్లూరు: అయ్యన్న చెరువు కాలనీలో అనుమతులు లేకుండా నిర్మించిన రేకుల షెడ్డుపై చర్యలు తీసుకోవాలని కొందరు సీఆర్డీఏ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు సోమవారం కాలనీకి వచ్చారు. షెడ్డు తొలగింపు పనులు ప్రారంభించగానే.. కాలనీలో ఉన్న అన్ని గృహాలకు నోటీసులు ఇవ్వాలని అధికారులను అడ్డుకున్నారు.

CHANGE OF NAME

I, **PRASADAM VEERAIAH** (Old Name) S/o, **BHUSHAIAH** R/o. D.No. 8-254, Ramalayam Center, Yarrabalem Village, Mangalagiri Mandal, Guntur District. Andhra Pradesh State - 522 503. I have changed my name from **PRASADAM VEERAIAH** (Old Name) to **PRASADAM VEERA SEKHARA RAO** (New Name). Hereafter my name is known as **PRASADAM VEERA SEKHARA RAO** (New name) S/o, **BHUSHAIAH** for all purposes.

ఉపాధ్యాయుడి సేవాభావం అభినందనీయం

అశోక్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తదితరులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతో పాటు సామాజిక సేవలు చేస్తున్న ఉపాధ్యాయుడు మద్దుకూరి అశోక్ మహోన్నత వ్యక్తిగా చరిత్రలో నిలుస్తారని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. రాజధాని గ్రామం మందడంలోని జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో మద్దుకూరి అశోక్ ఉద్యోగ విరమణ అభినందన సభ సోమవారం నిర్వహించారు. వినుకొండ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, మందడం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నగేష్, తుళ్లూరు ఎంఈవో అజయ్‌కుమార్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని అశోక్‌కు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి మాట్లాడుతూ ఉపాధ్యాయుడు అశోక్ కుల మతాలకు అతీతంగా సేవలందించారని కొనియాడారు. మద్దుకూరి ఫౌండేషన్ ద్వారా రూ.లక్షలు సేవా కార్యక్రమాలకు వినియోగించారన్నారు. వెయ్యికి పైగా శాస్త్రవేత్తల విగ్రహాలను వివిధ పాఠశాలలకు ఉచితంగా అందించారన్నారు.

రైతులకు రసాయనాల పిచికారీపై అవగాహన

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: పెదవడ్లపూడి గ్రామంలో విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ టెక్నాలజీ(వీఐఏటీ) వ్యవసాయ విభాగం విద్యార్థుల ఆధ్వర్యంలో రూరల్ అగ్రికల్చరల్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ కార్యక్రమంలో భాగంగా రసాయనాల పిచికారీ భద్రత, జేఈసీసీపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. అనంతరం రసాయనాలు, పురుగుమందులు, కలుపు మందులు పిచికారీ సమయంలో రైతులు పాటించాల్సిన రక్షణ చర్యలపై ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా తెలియజేశారు. రసాయనాల పిచికారీ సమయంలో మాస్క్, చేతి తొడుగులు, కళ్లజోడు, పాదరక్షలు వంటి వ్యక్తిగత రక్షణ పరికరాలు ఉపయోగించాలని సూచించారు. లేబుల్‌పై సూచించిన మోతాదులోనే రసాయనాలు వినియోగించాలన్నారు. పిచికారీ సమయంలో ఆహారం తీసుకోకూడదని, నీరు, పొగ తాగకూడదని పేర్కొన్నారు. అనంతరం చేతులు, ముఖం సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. రైతుల ఆరోగ్యాన్ని కాపాడుతూ, వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యతను, నిల్వ సామర్థ్యాన్ని మెరుగుపర్చడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని విద్యార్థులు తెలిపారు. ఆర్ఏడబ్ల్యూఈ సమన్వయకర్త హరీష్, రెహమాన్, బీఎస్సీ వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటపరికరాల అందజేత

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: నూతక్కి పీఎంశ్రీ ఉన్నత పాఠశాలకు ఆటవస్తువులు అందజేశారు. కొండా వేణుగోపాలరెడ్డి భార్య తనూజ జన్మదినోత్సవం సందర్భంగా సోమవారం ఆయన రూ.40 వేల విలువైన వాలీబాల్ కిట్, హాకీ స్టిక్కులు, ఫుట్‌బాల్‌లు, షటిల్ బ్యాట్లు, స్కిప్పింగ్ తాళ్లు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజీవ్‌రత్న, పీఈడీ దాసరి భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సత్కారం

మంగళగిరి టౌన్, న్యూస్‌టుడే: ఉద్యోగ విరమణ ప్రతి ఉద్యోగి జీవితంలో ఒక ముఖ్యమైన దశ అని నగరపాలక సంస్థ కమిషనర్ అలీం బాషా అన్నారు. నగరపాలక పరిధిలో విధులు నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారి డి.రమేష్ బాబు, సూపరింటెండెంట్ పి.వి.వి.సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ ఎం.మధుకిరణ్‌లను కార్యాలయంలో సోమవారం సత్కరించారు. అదనపు కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూడు సవరణలతో తుది జాబితా

దుగ్గిరాల, న్యూస్‌టుడే: పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మూడు సవరణలతో తుది జాబితా సోమవారం ప్రకటించారు. ఈమనిలో మూడు కేంద్రాల విషయంలో అభ్యంతరాలు పరిశీలించి, మార్పులు చేసి కలెక్టర్ అనుమతితో ప్రకటించారు. తహసీల్దార్ సునీత, డిప్యూటీ ఎంపీడీవో నెహ్రూ, పీడీవో మణికంఠ ఉన్నారు.

ఈతకు వెళ్లి ఐటీఐ విద్యార్థి దుర్మరణం

ప్రభాస్ (పాతచిత్రం)

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లిన విద్యార్థి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. నల్లపాడు పోలీసుల కథనం ప్రకారం.. మేడికొండూరు మండలం పేరేచర్ల డొంక ప్రాంతానికి చెందిన పోలిదాసు ప్రభాస్(22) పేరేచర్లలో ఐటీఐ చదువుతున్నాడు. సోమవారం మిత్రులతో కలిసి వంకాయలపాడు మేజర్ కాలువలో ఈతకు వెళ్లాడు. ఈక్రమంలో నీట మునిగి ఎంత సేపటికీ పైకి రాలేదు. స్నేహితులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. గజ ఈతగాళ్ల సాయంతో కాలువలో గాలించగా.. అప్పటికే మృతి చెందాడు.

వాహనం ఢీకొని రైతు మృతి

మేడికొండూరు, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ రైతు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. సిరిపురానికి చెందిన భీమినేని శ్రీనివాసరావు (30) వ్యవసాయం చేస్తుంటాడు. పొలం పని నిమిత్తం మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృత్యువాత

చినకొండ్రుపాడు(ప్రత్తిపాడు): క్యాటరింగ్ వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒడిశా కార్మికుడు గిరిధారీ(25) మృతి చెందాడు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో కిరణ్ మినీలారీలో క్యాటరింగ్ కోసం గుంటూరు వెళ్తుంది. ప్రత్తిపాడు మండలం చినకొండ్రుపాడు సమీపంలోకి సర్వీసు రోడ్డుపైకి వచ్చే సరికి ముందున్న క్యాటరింగ్ వాహనాన్ని లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో వాహనంలో వెనుక ఉన్న క్యాటరింగ్ కార్మికుడి తలకు తీవ్రగాయాలై మృతి చెందాడు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ప్రత్తిపాడు ఎస్సై నరహరి చెప్పారు. మృతుడికి భార్య, చిన్నపాప ఒడిశాలో ఉన్నారు.

చోరీకి వచ్చి.. జనం చేతికి చిక్కి..

తుమ్మపూడి(దుగ్గిరాల): చోరీకి వచ్చిన దొంగల్ని ప్రజలు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన తుమ్మపూడిలో జరిగింది. దుగ్గిరాలలోని తెనాలి-మంగళగిరి ప్రధాన రహదారిలో తుమ్మపూడి ఆర్చి వద్ద యార్లగడ్డ భానువీరేంద్రకు చిల్లర దుకాణం ఉంది. ఆయన తలుపులు వేసుకుని రాడ్లు అడ్డం పెట్టి లోపలే పడుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇద్దరు యువకులు దొంగతనానికి వచ్చి తలుపులు తీసే ప్రయత్నంలో ఉండగా శబ్దం వచ్చింది. వెంటనే వీరేంద్ర గ్రామంలోని బంధువులకు చరవాణి ద్వారా సమాచారం ఇచ్చాడు. గ్రామం నుంచి వచ్చిన పలువురు దొంగలను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వీరు విజయవాడ సింగ్‌నగర్‌వాసులని గుర్తించారు.

సమస్యలు తెలుసుకుందామంటే.. గేట్లు మూసేస్తారా..

దుగ్గిరాల, న్యూస్‌టుడే: గేట్లు మూసేసి సమస్యల్ని బయటకు రాకుండా అడ్డుకుంటారా? అని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి అన్నారు. వసతిగృహాల్లో సమస్యలు తెలుసుకునేందుకు సోమవారం ఆయన స్థానిక ప్రజాసంఘాల నాయకులతో కలిసి దుగ్గిరాలలో సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలుర వసతి గృహానికి వెళ్లారు. సిబ్బంది వారిని గేటు వద్దే ఆపేశారు. దీనిపై మాల్యాద్రి మాట్లాడుతూ ఇటీవల సమస్యలపై సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిని కలిస్తే ప్రభుత్వం హాస్టళ్లలో మెరుగైన సదుపాయాలు కల్పిస్తోందని, కావాలంటే వెళ్లి చూడాలన్నారని.. క్షేత్రస్థాయిలో హాస్టళ్లలోకి రానివ్వడం లేదన్నారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏనుగుల కమలాకర్, వ్యకాసం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు, సీఐటీయూ మండల కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.

ఆసుపత్రిని సందర్శించిన వైద్యుల బృందం

మోరంపూడి(దుగ్గిరాల): మోరంపూడిలోని గ్రెటనాల్టెస్‌లో జర్మనీ లెప్రసీ అండ్ టీబీ రిలీఫ్ అసోసియేషన్, జీఐజడ్ తోడ్పాటుతో నిర్వహిస్తున్న 'ఇన్‌క్లూజివ్ హాస్పిటల్ సర్వీసెస్ ఫర్ లెప్రసీ ఎఫెక్టెడ్ పర్సన్స్' కార్యక్రమాన్ని పరిశీలించేందుకు ఆ సంస్థ ప్రతినిధులు డాక్టర్ శ్రీలేఖ, డాక్టర్ ఆశిష్ సోమవారం మోరంపూడి వచ్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారితో వారు మాట్లాడారు. వ్యాధిపీడితుల గుర్తింపు, చికిత్స అందించడం ప్రాజెక్టులో భాగమని గ్రెటనాల్టెస్ డైరెక్టర్లు వంగర హేమ్‌చంద్, ఉదయార్క చెప్పారు. ఫిజియోథెరపిస్టు శివకుమార్ ఉన్నారు.

డ్రెయినేజీ సమస్యలకు పరిష్కారం

మంగళగిరి టౌన్: నగరపాలక సంస్థ పరిధిలో డ్రెయినేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అనుసంధాన డ్రెయిన్ల విస్తరణ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు కమిషనర్ అలీంబాషా తెలిపారు. పట్టణంలోని మార్కండేయ కాలనీ, టిడ్కో గృహాల పరిధిలోని డ్రెయిన్లను ఇంజినీరింగ్, ఉద్యానవన విభాగాల అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. బాప్టిస్ట్‌పేటకు అనుసంధానమైన డ్రెయిన్‌లో నీటి ప్రవాహం, పారిశుద్ధ్య పరిస్థితులను సమీక్షించారు.

SBI భారతీయ స్టేట్ బ్యాంక్

హోమ్ లోన్ సెంటర్-2 (ఆర్ఏసిపిసి-2), డి.నెం.54-15-1/బి, యలమంచిలి కాంప్లెక్స్, వెంకటేశ్వర నగర్, విజయవాడ-520 008.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని 13(2) క్రింద దిగువ వారికి

1) శ్రీమతి దొండ్లవాగు భావ్య, భర్త: వై. ఎస్. గణేష్ రెడ్డి, ఫ్లాట్ నెం: ఏ-బ్లాక్, శ్రీ చక్ర రెసిడెన్సీ, క్యాంప్ ఆఫీస్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా-522501. **మరియు** డోర్ నెం: 4-2-122, మాధురి ఐస్ ఫ్యాక్టరీ స్ట్రీట్, అంకాళమ్మ పేట, పులివెందుల, వై.ఎస్.ఆర్ కడప జిల్లా – 516390. **మరియు** డోర్ నెం: 12-203, ఫ్లాట్ నెం: 510, ఫోర్త్ ఫ్లోర్, కెపిఆర్ రెసిడెన్సీ, తాడేపల్లి, గుంటూరు జిల్లా – 522501.

హెచ్/ఎల్ నెం: 42040894940, 42083803066.

సార్,

మీరు విజయవాడ మెయిన్ బ్రాంచ్, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా నుండి ఈ దిగువ ఉదహరించిన స్థిరాస్తిని తనఖా ఉంచి హోమ్ లోన్ ఫెసిలిటీస్ సౌకర్యాన్ని పొందియున్నారు. సదరు లోన్ ఋణము **ది 30.07.2026 నాటికి మొత్తము బకాయి రూ. 31,79,858/- (అక్షరాలా రూపాయలు ముప్పై ఒక లక్షల డెబ్బై తొమ్మిది వేల ఎనిమిది వందల యాభై ఎనిమిది మాత్రమే)** మరియు ఒప్పందపడమైన వడ్డీ తదుపరి కాస్ట్, చార్జీలు, ఇతరములైన ఖర్చులు మొత్తము బకాయిగా ఉన్నాయి.

తనఖాపెట్టిన స్థిరాస్తి వివరము

షెడ్యూల్ - A : గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధి, తాడేపల్లి మండలం, తాడేపల్లి మున్సిపల్ ఏరియా, తాడేపల్లి గ్రామంలో గల డి.నెం. 112 లోని 2953.66 చ.గజాల విస్తీర్ణం, డి. నెం. 111లో, 26.34 చ.గజాల విస్తీర్ణం, బ్లాక్ నెం: 12, సమీప డోర్ నెం: 12-203. మొత్తం 2980 చ.గజాల విస్తీర్ణం గల స్థలం తాడేపల్లి గ్రామం & మండలం, గుంటూరు జిల్లా, శ్రీమతి దొండ్లవాగు భావ్య, తండ్రి: డి. శ్రీనివాసులు, భర్త: వై. ఎస్. గణేష్ రెడ్డి గారికి చెందిన రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెం.7832/2023, తేది 14.07.2023, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, పటమట, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా, **అపార్ట్‌మెంట్ హద్దులు: తూర్పు:** రివర్ ఓక్ యొక్క కాంపౌండ్ వాల్ 46-6 అడుగులు, **దక్షిణం:** రివర్ ఓక్ యొక్క కాంపౌండ్ వాల్ 83-0 అడుగులు, **తిరిగి తూర్పు:** రివర్ ఓక్ యొక్క కాంపౌండ్ వాల్ 45-3 అడుగులు, **తిరిగి దక్షిణం:** కొంత మేరకు సంగాల సింధూరకు చెందిన ఆస్తి మరియు ఈ అపార్ట్‌మెంట్‌కు రోడ్డు 297-0 అడుగులు, **పడమర:** మున్సిపల్ రోడ్డు 4-0 అడుగులు, **ఉత్తరం:** బుర్రముక్కు శివ రెడ్డి గారికి చెందిన ఆస్తి 53-0 అడుగులు, **తిరిగి పడమర:** బుర్రముక్కు శివ రెడ్డి గారికి చెందిన ఆస్తి 91.10 అడుగులు, **తిరిగి ఉత్తరం:** బుర్రముక్కు శివ రెడ్డి గారికి చెందిన ఆస్తి 325-10 అడుగులు. ఈ హద్దుల మధ్య గల 2980 చ.గజాలు లేదా 2491.57 చ.మీ.ల స్థలంలో 58 చ.గజాలు లేదా 48.49 చ.మీ.ల అవిభాజ్యపు మరియు నిర్దిష్టమైన ఉమ్మడి వాటా స్థలం.

షెడ్యూల్ - B : షెడ్యూల్ - Aలోని మొత్తం స్థల విస్తీర్ణంలో నిర్మించబడిన నివాస అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్, "కె పి ఆర్ రెసిడెన్సీ" పేరుతో, నాలుగవ అంతస్తులో గల ఫ్లాట్ నెం: 510, **ఫ్లాట్ హద్దులు: తూర్పు:** కామన్ కారిడార్, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర:** ఓపెన్ టు స్కై, **ఉత్తరం:** ఓపెన్ టు స్కై. పై హద్దుల మధ్య 1090 చ.అడుగుల ప్లింత్ ఏరియా, 227 చ.అడుగుల కామన్ ఏరియా, 100 చ.అడుగుల కార్ పార్కింగ్ ఏరియా గల ఆర్‌సిసి నివాస ఫ్లాట్.

1) శ్రీమతి దొండ్లవాగు భావ్య, భర్త: వై.ఎస్. గణేష్ రెడ్డి, మీకు బ్యాంకు వారు మంజూరు చేసిన ఋణసౌకర్యం నిమిత్తం పైన ఉదహరించిన స్థిరాస్తులను తనఖా ఉంచినారు. పైన పేర్కొనబడిన చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద **ది.30-07-2026 వ తేదీన డిమాండ్ నోటీసును** బ్యాంకుచే మీకు జారీచేయడమైనది. కానీ జారీ చేసిన నోటీసును ఋణగ్రహీతలు/హామీదారు స్వీకరించనందున **ఈ పత్రికా ప్రకటన జారీచేయడమైనది**. బ్యాంకు వారు జారీచేసిన షరతులు మరియు నిబంధనలు పాటించడంలో మీరు విఫలమైనందున ఖాతా క్రమము తప్పి ఆర్.బి.ఐ మార్గదర్శకాల ప్రకారం **ది.29-03-2026 వ తేదీన ఎన్.పి.ఎగా (మొండిబకాయి)** పరిగణించబడినది. సదరు పైన తెలిపిన ఋణమొత్తము మరియు ఒప్పందపరమైన వడ్డీ ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి 60 దినములలో తిరిగి చెల్లించవలసినదిగా మిమ్మల్ని కోరడమైనది. లేనియెడల ఎటువంటి తదుపరి ప్రకటన లేకుండా సెక్షన్ 13(4) క్రింద పైన తెలిపిన సెక్యూరిటీపై SARFAESI చట్టం, 2002 లోని నిబంధనలు అమలు చేసేందుకు, చర్యలు చేపట్టుటకు సెక్యూర్డ్ క్రెడిటర్ అగు దిగువ సంతకందారునకు అధికారం కలదు. ఉద్దేశించబడిన చట్టంలో మరియు లేదా అమలులో ఉన్న ఏ చట్టం క్రింద మాకు లభించే ఏ ఇతర హక్కులకు భంగం కలుగకుండా ఇవి జారీచేయడమైనది.

తేది :30-07-2026
ప్రదేశం :విజయవాడ

అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

గుంటూరు తూర్పు

రూ.1.18 కోట్ల సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ఎన్టీఆర్ సర్కిల్: పేదల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి రక్షణ కవచంలా నిలుస్తోందని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన 53 మంది లబ్ధిదారులకు రూ.1.18 కోట్ల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.14 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశామన్నారు. గత వైకాపా ప్రభుత్వం ఆరోగ్య రంగాన్ని నిర్వీర్యం చేసిందని విమర్శించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
94406 38515, 80085 73097

స్పందన: మారుతీనగర్ ప్రధాన రోడ్డులో చెత్తకుప్పలు రెండ్రోజులుగా తీయకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా ఉందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. స్పందించిన శానిటరీ సూపర్‌వైజర్ ఆయాజ్‌ఖాన్ చెత్తకుప్పలు తీయించి తరలింపజేశారు. ☛ సంజీవయ్యనగర్ మూడోలైన్ సైడ్ కాలువల్లో పూడికలు చేరి మురుగునీరు పారుదల కాక సమస్యలు వస్తున్నాయని స్థానికులు ప్రజారోగ్య అధికారులకు తెలపగా.. వారు స్పందించి పూడికలు తీయించారు. - న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

జోసెఫ్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలి

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: అప్పికట్ల జోసెఫ్ జీవిత చరిత్రను భావితరాలకు అందించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో పెన్షనర్ల భవన్‌లో జోసెఫ్ వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంటరానితనం, నిరక్షరాస్యత, పేదరికం ఎక్కువగా ఉన్న సమయంలో జోసెఫ్ ఉన్నత విద్యనభ్యసించి పార్లమెంటు సభ్యుడిగా, శాసనమండలి సభ్యుడిగా ఎన్నికయ్యారని చెప్పారు. జోసఫ్ కాంస్య విగ్రహాన్ని విజయవాడలో ఆయన నివసించిన ప్రాంతంలో ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ పూర్వపు స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ పీవీ రమేష్ మాట్లాడుతూ.. దళితుల విద్యాభివృద్ధికి అప్పికట్ల కృషి చేశారన్నారు. శాసనమండలి మాజీ సభ్యులు జల్లి విల్సన్, వినయ్‌కుమార్, జీవరత్నం, మాల్యాద్రి, పోలూరి వీరారెడ్డి, ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సత్కారం

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: జీఎంసీలో హెచ్‌డీగా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన డీఈఈ నాగభూషణం సేవలను కమిషనర్ మయూర్ అశోక్ ప్రస్తుతించారు. సోమవారం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన ఉద్యోగ విరమణ సభలో కమిషనర్ మాట్లాడుతూ జీఎంసీలో హెచ్‌డీగా, డీఈఈగా నిబద్ధతతో పనిచేశారన్నారు. నాగభూషణం దంపతులను ఘనంగా సత్కరించారు. ఇన్‌ఛార్జి ఏసీ సాంబశివరావు, డీసీ శ్రీనివాసరావు, ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ దాసరి శ్రీనివాసరావు, జీఎంసీ ఎస్ఈ సుందరామిరెడ్డి, ఈఈలు, డీఈఈలు పాల్గొన్నారు.

నాగభూషణం దంపతులను సత్కరించిన కమిషనర్ మయూర్ అశోక్, అధికారులు

వేదన వినండి.. వెతలు తీర్చండి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 155 మంది ఫిర్యాదులు చేశారు. ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ రమణమూర్తి, డీఎస్పీలు సీతారాం, పూర్ణచంద్రరావు ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారానికి ఆదేశించారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఎస్పీ రమణమూర్తి, డీఎస్పీ సీతారాం

కుమారుడి మృతి మిస్టరీ తేల్చండి

నా కుమారుడు రాకేష్ మే నెలలో తక్కెళ్లపాడులో చనిపోయి ఉన్నాడని అక్కడివాళ్లు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వెళ్లి చూస్తే నా కుమారుడిని ఎవరో చంపి పడేసినట్లు ఉంది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదు. ఓ మహిళ, ఆమె కుటుంబ సభ్యులపై అనుమానం ఉంది. **- బసవ దేవి**

ఆభరణాలు మాయం చేశారు

పాత ఆరున్నర సవర్ల బంగారు ఆభరణాలను మార్చి కొత్తవి చేయిస్తామని చెప్పి బంధువులు తీసుకెళ్లారు. సంవత్సరాలు గడుస్తున్నా వాటిని ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. **- కృష్ణకుమారి, కుమారుడు శ్రీనివాసరావు**

బంగారం ఇవ్వడం లేదు

2024 సెప్టెంబర్‌లో మా ఇంట్లో చోరీ జరిగింది. 600 గ్రాములకు పైగా బంగారు వస్తువులు పోయాయి. పోలీసులకు ఫిర్యాదు చేస్తే 529 గ్రాములని కేసు నమోదు చేశారు. ఇద్దరు దొంగలు దొరికారని 250 గ్రాములే ఇచ్చారు. మిగిలింది ఇవ్వడం లేదు. **- ఓ మహిళ, ఎస్వీఎన్ కాలనీ**

రక్షణ కల్పించండి

నా తండ్రి ప్రభుదాసు వీఆర్ఏగా పనిచేస్తున్నారు. ఓ స్థలాన్ని కొంతమంది కబ్జా చేయడంతో అడ్డుకున్నారు. ఆ కక్షతో మా ఇంటిపై 12 మంది దుండగులు దాడి చేశారు. నా తండ్రి తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా సరిగా స్పందించలేదు. మాకు ప్రాణహాని ఉంది. **-డేవిడ్ రాజు**

3 నుంచి ఓటర్ల జాబితాపై గ్రామ సభలు

కలెక్టరేట్, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఈ నెల 3 నుంచి 6 వరకు గ్రామ సభలు నిర్వహించాలని కలెక్టర్ సాయికాంత్‌వర్మ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల తుది ప్రచురణ చేశామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఓటర్లకు సంబంధించి అభ్యంతరాలుంటే సెప్టెంబరు 2లోగా విచారణ పూర్తి చేయాలని సూచించారు. గ్రామ సభల నిర్వహణకు ప్రత్యేక అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని చెప్పారు. శాఖల వారీగా సేవలు, లోపాలు గుర్తించి వాటిని సరిదిద్దుకోవాలన్నారు. పట్టణ భూపరిమితి చట్టం కింద ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జేసీ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్‌లో భాగంగా 75శాతం వరకు విచారణ పూర్తయ్యిందని, మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లో ఈ ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో నగర కమిషనర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో ఎన్.ఎస్.కె.ఖాజావలి, జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, సీపీవో శేషశ్రీ, డీపీవో బి.వి.నాగసాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా అర్జీలు పరిష్కరించకపోతే చర్యలు

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: పీజీఆర్ఎస్, ఇతర మార్గాల ద్వారా వచ్చే ప్రజా ఫిర్యాదులు, అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశించారు. సోమవారం కౌన్సిల్ హాల్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన అర్జీలు స్వీకరించారు. పట్టణ ప్రణాళిక 11, ఇంజినీరింగ్ 21, రెవెన్యూ 9, ప్రజారోగ్యం 5, ఉపాసెల్ 2, అకౌంట్స్ విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ పరిష్కరించలేని అర్జీలు ఉంటే సంబంధిత దరఖాస్తుదారులకు సాంకేతిక ఇబ్బందుల గురించి తెలిపి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. నిర్ణీత గడువులోగా పరిష్కరించని అధికారులపై శాఖాపరంగా చర్యలుంటాయని హెచ్చరించారు. ఎస్ఈ సుందరామిరెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ సురేష్, డీసీపీ సూరజ్‌కుమార్, ఏవో తిరుపతినాయుడు, మేనేజరు బాలాజీబాషా తదితరులు పాల్గొన్నారు. ☛ కింగ్ హోటల్ పక్కగా ఓల్డ్ పోలీస్ లైన్ ప్రాంతంలో 22 గజాల స్థలంలో జీ+2 నిర్మాణం చేపట్టారని, దానికి ఎలా అనుమతి ఇచ్చారని షేక్ ముజీబ్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ☛ పెదపలకలూరు రోడ్డు ఉద్యోగ నగర్‌లో రహదారులు, కాలువ అభివృద్ధి పనులు మధ్యలో ఆగడం వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని ఉద్యోగనగర్ కాలనీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు వినతిపత్రం అందజేశారు. రెండోలైన్ దక్షిణం రోడ్డు, 4, 5, 7 లైన్ల కాలువలు, ఏడో లైన్‌లో రహదారి నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. పార్కులోనూ అభివృద్ధి పనులు ఆగిపోయాయన్నారు. శ్మశానంలో దహన సంస్కారాలు చేయడం వల్ల పొగ, దుమ్ము, వాసన వస్తున్నాయని చుట్టుపక్కల నివసిస్తున్న వారు నిత్యం తలుపులు వేసుకుని ఉండాల్సిన పరిస్థితి వస్తుందని తెలిపారు. ☛ చౌడవరం జర్నలిస్ట్ కాలనీలో పలు రహదారులు అధ్వానంగా ఉండి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు షేక్ షరీన్ ఫిర్యాదు చేశారు. వెంటనే ఖాళీస్థలాల్లో యజమానులకు పిచ్చి మొక్కలు తొలగించుకునేలా చర్యలు తీసుకుని, రహదారులు, కాలువల నిర్మాణాలు చేపట్టాలని కోరారు.

రేషన్ మాఫియా ఆగడాలు భరించలేకపోతున్నాం

పోలీసు కార్యాలయంలో ఎస్పీకి ఫిర్యాదు

నెహ్రూనగర్: వైకాపా ప్రభుత్వ హయాంలో ఏర్పడిన రేషన్ మాఫియా ఆగడాలు నేటికీ కొనసాగుతున్నాయని.. వారి బెదిరింపులు భరించలేకపోతున్నామని సహకార చౌక దుకాణాల సంఘం నగర అధ్యక్షుడు గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ రమణమూర్తికి ఫిర్యాదు చేశారు. విచారించి చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గాంధీ విలేకర్లతో మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఏర్పడిన రేషన్ మాఫియా ముఠా రేషన్ బియ్యం సేకరించి దారి మళ్లిస్తున్నారని చెప్పారు. ముఠాలోని అనిల్ అనే వ్యక్తి వైకాపా మాజీ ఎమ్మెల్యే ముస్తఫా వద్ద ఉంటున్నాడని చెప్పారు. అతను పౌరసరఫరాల బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు జేసీ గుర్తించి పోలీసులకు అప్పగించారని తెలిపారు. అతని మాట వినని డీలర్లపై రకరకాల వంకలతో అధికారులకు ఫిర్యాదులు చేయిస్తున్నాడన్నారు.

సేవలు ప్రశంసనీయం

రవికుమార్, శివరామబాబులను సన్మానించిన ఎస్పీ వకుల్ జిందాల్, డీఎస్పీలు అహారి శ్రీనివాస్, సుంకరయ్య

గుంటూరు నేరవార్తలు: పోలీసుశాఖలో సుదీర్ఘకాలం పని చేసిన ఎస్సై రవికుమార్, ఏఎస్సై శివరామబాబులు ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం పోలీసు కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ సన్మానించి వారి సేవలను ప్రశంసించారు. డీఎస్పీలు అహారి శ్రీనివాస్, సుంకరయ్య, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, కృష్ణయ్య, పోలీసు అధికారుల సంఘం నాయకులు సాంబశివరావు, లక్ష్మయ్య, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దళవాయి సుబ్రహ్మణ్యం, పీఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభివృద్ధిలో నూతన అధ్యాయం లిఖిస్తున్నాం

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే: అభివృద్ధిలో నూతన అధ్యాయం లిఖిస్తున్నామని తూర్పు ఎమ్మెల్యే నసీర్ పేర్కొన్నారు. గుంటూరువారితోట, ఓల్డ్‌క్లబ్ రోడ్డు, రైలుపేటలో రూ.1.46 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు, డ్రెయిన్లు, మంచినీటి పైపులైన్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో అభివృద్ధి అటకెక్కిందన్నారు. కనీసం మంచినీళ్లు కూడా సక్రమంగా సరఫరా చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో రూ.350 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని వివరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

అవినీతికి తావులేకుండా పింఛన్ల పంపిణీ

జిల్లా పరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే : ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లకు సంబంధించి ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చేలా చూడాలని జిల్లా పరిషత్తు సీఈవో వి.జ్యోతిబసు అన్నారు. సోమవారం ఆయన జడ్పీ కార్యాలయం నుంచి డీఆర్‌డీఏ పీడీ, డీపీవో, ఎంపీడీవోలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. అధికారులు సెప్టెంబరు 1న లబ్ధిదారుల గృహాలకు వెళ్లి పింఛను నగదు అందజేయాలని చెప్పారు. అవినీతికి తావులేకుండా, లబ్ధిదారులతో మర్యాదగా వ్యవహరించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవీఆర్ఎస్ సర్వేలో పింఛన్ల పంపిణీలో సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారా? ఇంటి వద్దనే ఇస్తున్నారా? మర్యాదగా వ్యవహరిస్తున్నారా? అనే మూడు ప్రశ్నలు అడిగి ప్రజల స్పందన అడుగుతారన్నారు. ప్రజలతో గౌరవంగా మాట్లాడాలని స్పష్టం చేశారు. పంపిణీలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని సూచించారు. డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ.. మేడికొండూరు, ఫిరంగిపురం, తాడికొండ, తుళ్లూరు, పొన్నూరు మండలాల్లో అధికారుల పనితీరుపై ఎంపీడీవోలు పర్యవేక్షించాలని సూచించారు. ప్రజా సానుకూల స్పందన (పీపీపీ) సర్వేలో సేవలపై సంతృప్తి శాతం పెరగడం కన్నా వ్యతిరేకత రావడంపై అధికారులు దృష్టిసారించాలని కోరారు. డీపీవో బి.వి.నాగసాయికుమార్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు తెప్పించుకుంటున్నామని వివరించారు.

వెండింగ్ జోన్‌ల ఏర్పాటుపై హైకోర్టుకు

నగరపాలక సంస్థ: ప్రభుత్వం జీవో జారీ చేసినా ఇప్పటి వరకు వెండింగ్ జోన్‌ల ఏర్పాటుపై చర్యలు తీసుకోలేదని.. వెంటనే జోన్‌ల ఏర్పాటు దిశగా ఆదేశాలు ఇవ్వాలని ది గుంటూరు ఫుట్‌పాత్ అండ్ తోపుడు, వీధిబండ్లు, చిరువ్యాపారుల సంఘం నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. వీధి వ్యాపారుల జీవనోపాధి దెబ్బతినకుండా, ట్రాఫిక్, ప్రజలకు ఆటంకం లేకుండా శాస్త్రీయ విధానంలో జోన్‌లు ఏర్పాటు చేయాలని ఇటీవలే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

వాటర్ ట్యాంకర్ ప్రారంభం

గుంటూరు నగరం: గుంటూరు నగరంలోని మొక్కలను సంరక్షించేందుకు చేయూత ఫౌండేషన్ వాటర్ ట్యాంకర్ అందించడం హర్షణీయమని, విశ్రాంత ఐఏఎస్ పి.వి రమేష్ తెలిపారు. గుంటూరు తాలూకా కార్యాలయ ప్రాంగణంలో చేయూత ఫౌండేషన్ ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకర్‌ను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. లక్ష్మణరెడ్డి, నిర్మల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీ ప్రజల్ని మభ్య పెడుతున్నారు

పట్నంబజారు, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో అంటరానితనం కొనసాగుతోందని రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మొరతోటి విజయకుమార్ అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయటాన్ని నిరసిస్తూ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం హైవే రోడ్డులోని భాజపా కార్యాలయాన్ని ముట్టడించి మనుస్మృతి ప్రతిని దహనం చేశారు. విజయకుమార్ మాట్లాడుతూ ఉత్తరాఖండ్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న సభా వేదికను శుద్ధి చేయటం దళిత జాతిని అవమానించటమే అన్నారు. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పగడాల ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ దేశ ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కట్టా జవహర్‌బాబు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో దేశ ప్రజలు భాజపాకు తగిన బుద్ధి చెబుతారన్నారు. మైనుద్దీన్, ఎన్.అఖిల్, శోభరాజ్, పవన్, ప్రదీప్ రాయల్, అలీఖాన్, శ్రీనివాస్, కిషోర్ పాల్గొన్నారు.

నిరసనలో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు

హిందూ కళాశాల సెంటర్లో... డీసీసీ అధ్యక్షుడు యన్నం సుధీర్‌బాబు ఆధ్వర్యంలో హిందూ కాలేజీ సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు నిరసన చేశారు. నగర అధ్యక్షుడు ఖలీల్, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, గడ్డం పాల్, జవహర్‌బాబు, కరీం, వెంకటరెడ్డి, జయసుధ పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ నాయకుల అరెస్టు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: భాజపా కార్యాలయ ముట్టడికి యత్నించిన యుజన కాంగ్రెస్ నాయకులను సోమవారం నగరంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. విజయ్‌కుమార్, జవహర్‌బాబు, ప్రసాద్‌తోపాటు అఖిల్, శోభరాజు, పవన్, ప్రదీప్‌లను పోలీసు స్టేషన్‌కు తరలించి నోటీసులిచ్చి పంపేశారు.

సీఎస్ఆర్ నిధులతో తరగతి గదుల నిర్మాణం

పట్టాభిపురం, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వ నిధులు, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతోపాటు సీఎస్ఆర్ నిధుల్ని సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి పనులు చేస్తున్నామని కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. రూ.1.98 కోట్ల సీఎస్ఆర్ నిధులతో అదనపు తరగతి గదుల భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. సోమవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదుల భవన నిర్మాణానికి ఆయన తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. కోల్ ఇండియా నుంచి రూ.2 కోట్ల సీఎస్ఆర్ నిధుల్ని సమీకరించామన్నారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విద్యార్థుల సమస్యల్ని గాలికి వదిలేసిందని విమర్శించారు.

శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

యుద్ధప్రాతిపదికన రహదారుల విస్తరణ

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ రహదారి విస్తరణలో మిగిలిన పనులను పది రోజుల్లో పూర్తి చేసి సెంటర్ డివైడర్ నిర్మాణ పనులు ప్రారంభించాలని కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశించారు. సోమవారం కమిషనర్ ఛాంబర్‌లో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ఏపీసీపీడీసీఎల్ అధికారులతో రహదారుల విస్తరణ పనుల పురోగతిపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ బృందావన్‌గార్డెన్స్ కూడలి నుంచి హనుమయ్య కంపెనీ వరకు రహదారి విస్తరణ పనులు అన్ని విభాగాల సమన్వయంతో యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఏపీయూఐఎంఎల్ ప్రతినిధులతో కలిసి పనిచేయాలన్నారు. భవన యజమానులతో మాట్లాడి, నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందజేసి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. చుట్టుగుంట వద్ద చంద్రబానుకుంట రోడ్డు విస్తరణ మ్యాప్‌లను పరిశీలించి, త్వరితగతిన రహదారి విస్తరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సీపీ రాంబాబు, ఎస్ఈ సుందరామిరెడ్డి, ఏసీపీ రెహమాన్, డీఈఈ వెంకటరమణ, విద్యుత్తు శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్లాను పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ మయూర్ అశోక్

నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై కేసులు

పట్నంబజారు, న్యూస్‌టుడే: బస్టాండు సెంటర్, హిమని సెంటర్లలో సోమవారం ట్రాఫిక్ పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడుపుతున్న వారిపై 244 కేసులు నమోదు చేసి అపరాధరుసుంగా రూ.25,745 వసూలు చేసినట్లు తూర్పు విభాగపు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

ఈతకు వెళ్లి ఐటీఐ విద్యార్థి దుర్మరణం

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లిన విద్యార్థి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. నల్లపాడు పోలీసుల కథనం ప్రకారం.. పేరేచర్ల డొంక ప్రాంతానికి చెందిన పోలిదాసు ప్రభుదాసు(22) పేరేచర్లలో ఐటీఐ చదువుతున్నాడు. సోమవారం మిత్రులతో కలిసి వంకాయలపాడు మేజర్ కాలువలో ఈతకు వెళ్లాడు. నీట మునిగి ఎంత సేపటికీ పైకి రాలేదు. స్నేహితులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. గజ ఈతగాళ్ల సాయంతో కాలువలో గాలించగా.. అప్పటికే మృతి చెందాడు.

ప్రభుదాసు (పాతచిత్రం)

బీసీల ఎదుగుదలను అడ్డుకుంటున్న జగన్

పట్నంబజారు, న్యూస్‌టుడే: బీసీలను రాజకీయంగా ఎదగనీయకుండా మాజీ ముఖ్యమంత్రి జగన్ అడ్డుకుంటున్నారని జాతీయ బీసీ బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కూటమి ప్రభుత్వం చెప్పగా.. రాజకీయ కుట్రలో భాగంగా వైకాపా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిందన్నారు. స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు ఆ పార్టీ నేతలు చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించటం ద్వారా 16,800 మందికి అన్యాయం జరిగిందన్నారు.

అర్ధ మారథాన్‌లో హోంగార్డు ప్రతిభ

నెహ్రూనగర్: హైదరాబాద్‌లో గత నెల 30న నిర్వహించిన అర్ధ మారథాన్‌లో గుంటూరు హోంగార్డు కృష్ణ కిషోర్ 21 కిలోమీటర్లను గంట 40 నిమిషాల 50 సెకన్లలో పూర్తి చేసి ప్రతిభ కనపరచారు. ఆయనను సోమవారం ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించి ప్రశంసా పత్రం, పతకం అందించారు.

కృష్ణకిషోర్‌కు ప్రశంసాపత్రం, పతకం అందిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

కమ్యూనిటీహాలుకు స్థలం కేటాయించండి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రజక కమ్యూనిటీహాల్‌కు స్థలం కేటాయించి నిర్మాణం పూర్తి చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట నరసయ్య డిమాండ్ చేశారు. సోమవారం నగరంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కొండయ్య, ముత్యాలరావు, రాంబాబు, కైలాసం, శ్రీను, సుబ్రహ్మణ్యం, సుబ్బారావు, సాంబశివరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

నిరసనలో వెంకట నరసయ్య, కొండయ్య, ముత్యాలరావు, రాంబాబు

విద్యార్థుల సంక్షేమానికి చేయూత

పట్టాభిపురం, న్యూస్‌టుడే : కాకతీయ కన్వెన్షన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బాలుర వసతి గృహం అభివృద్ధి, సంక్షేమానికి కమ్మజన సేవా సమితి లైఫ్ టైమ్ ఛైర్మన్, ప్రవాసాంధ్రులు నూతక్కి రామకృష్ణ ప్రసాద్ రూ.5 లక్షలు విరాళం అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కును కేఐసీసీ కార్యదర్శి ఘంటా పున్నారావుకు ఇచ్చారు. ప్రవాసాంధ్రులు కొడాలి చంద్రమౌళి, కొడాలి వెంకట రాజేశ్వరి పేద విద్యార్థినుల విద్యాభ్యాసం, ఉపకారవేతనాలకు రూ.లక్ష విరాళం అందజేశారు. పువ్వాడ కాశీ విశ్వేశ్వరరావు ద్వారా అందించారు. కమ్మజన సేవా సమితి అధ్యక్షులు మల్లెల హరీంద్రనాథ్ చౌదరి, సభ్యులు దండా బ్రహ్మానందం, రావెల సత్యనారాయణ, కొప్రపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.



పున్నారావుకు చెక్కు అందజేస్తున్న రామకృష్ణ ప్రసాద్ తదితరులు

ఆటో ఢీకొని వృద్ధుడికి గాయాలు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పోలీసు కల్యాణమండపం ఎదుట ద్విచక్రవాహనంపై వెళ్తున్న వృద్ధుడిని ఆటో ఢీకొట్టిన ఘటనపై సోమవారం ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. తలకు బలమైన గాయం కావడంతో మస్తాన్‌వలిని ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు.

విద్యారంగంలో జ్యోత్స్నకుమారి కృషి అభినందనీయం

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విద్యారంగంలో అధ్యాపకురాలిగా, ప్రిన్సిపల్, ఆర్జేడీగా డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి సేవలు ప్రశంసనీయమని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.కళ్యాణి అన్నారు. సోమవారం బృందావన్‌గార్డెన్స్ ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆర్జేడీ ఉద్యోగ విరమణ సభ నిర్వహించారు. సభలో డాక్టర్ జ్యోత్స్నకుమారి, కొమరగిరి మహేశ్వరప్రభు దంపతులను ఘనంగా సత్కరించారు. మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణ గౌరీశంకర్, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, డాక్టర్ పరుచూరి విజయలక్ష్మి, డాక్టర్ ఉమాదేవి, బోడేపూడి వెంకటేశ్వరరావు, లలిత గణేష్‌ప్రభు, రవిచంద్ర, డాక్టర్ విశ్వం, డాక్టర్ మోజస్, రవీంద్ర, ఆర్జేడీ కార్యాలయ అధికారులు, సిబ్బంది, ప్రభుత్వ మహిళా కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

జ్యోత్స్నకుమారి, మహేశ్వరప్రభు దంపతులను సత్కరిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ కళ్యాణి

ప్రతి విద్యార్థిని తీర్చిదిద్దేలా ప్రణాళిక

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థిని తీర్చిదిద్దేలా విద్యాప్రమాణాలు అభివృద్ధి చేస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ డి.కల్యాణి తెలిపారు. సోమవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తల్లిదండ్రులు, అధ్యాపకుల సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతి, హాజరు, ప్రవర్తన, కళాశాల కార్యక్రమాల్లో విద్యార్థినుల భాగస్వామ్యం అంశాలను వివరించారు. విద్యార్థినుల ప్రతిభా సామర్థ్యాలు మెరుగు పరిచేందుకు అధ్యాపకులతోపాటు తల్లిదండ్రులు కూడా మార్గదర్శనం, ప్రోత్సాహం అందించాలన్నారు. అధ్యాపకులు డా.కె.అనిత, పద్మజ, పి.నిర్మలాకుమారి, జి.పద్మినిదేవి, ఎన్.అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణకు సహకరించండి

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: జీఎంసీ విద్యుత్తు విభాగంలో అక్రమాలకు పాల్పడి ప్రభుత్వానికి నష్టం కలిగించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పటి ఏఈ పీర్ అహ్మద్ కేసు విచారణకు సహకరించాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసు విచారణ అధికారిగా గుంటూరు పబ్లిక్ హెల్త్(క్యూసీ) ఎస్ఈ డి.శ్రీనివాసరావు ఉన్నారు.

జోనల్ మలేరియా అధికారిగా మంగాదేవి

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: వైద్యారోగ్యశాఖలో పని చేస్తున్న డిప్యూటీ సివిల్ సర్జన్ క్యాడర్ అధికారులకు సివిల్ సర్జన్లుగా ప్రభుత్వం పదోన్నతులిచ్చి కొత్త పోస్టింగ్‌లు ఇచ్చింది. నెల్లూరు డీసీఎస్ సెంట్రల్ ప్రిజన్ నుంచి డాక్టర్ మస్తానమ్మ గుంటూరులోని రీజనల్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లో సివిల్ సర్జన్ బ్యాక్టీరియాలజిస్ట్‌గా రానున్నారు. విజయవాడ జీజీహెచ్‌లో డీసీఎస్ ఆర్ఎంవోగా ఉన్న డాక్టర్ టీఎస్ మంగాదేవి గుంటూరు ప్రాంతీయ జోనల్ మలేరియా అధికారిగా వస్తున్నారు.



(c) eenadu

గుంటూరు పశ్చిమ

అలరించిన భక్తి సంకీర్తన

ఆలపిస్తున్న సాయిబాబు శర్మ బృందం

గుంటూరు సంస్కృతికం: స్థానిక సంపత్ నగర్ శారదా పరమేశ్వరి ఆలయ ప్రాంగణం శివాలయ మండపంలో స్వరరాగ సుధ ఆధ్వర్యంలో భక్తి సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. కటుకూరు వెంకట సాయిబాబుశర్మ బృందం ఆలపించిన పలు భక్తి గీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి. హార్మోనియంపై చిట్టిబాబు, డోలక్‌పై కోటేశ్వరరావు సహకరించారు.

ధర వరలు

కృష్ణనగర్ రైతుబజార్లో ధరలు.. టమాట 29, వంగ 24, బెండ 15, పచ్చిమిర్చి 42, కాకర 30, బీర 37, క్యాలీఫ్లవర్ 35, క్యాబేజి 25, క్యారెట్ 52, దొండ 29, బంగాళదుంప 23, ఉల్లిపాయలు 48, గోరుచిక్కుడు 25, దోస 16, సొర 14, పొట్ల 20, అరటికాయ 10, పెద్ద చిక్కుడు 34, చామదుంప 34, ముల్లంగి 8, బీట్‌రూట్ 41, కీర 50, బీన్స్ 105, క్యాప్సికమ్ 55, కొత్తిమీర 25, ఆకుకూరలు 10, నిమ్మకాయలు 80, అల్లం 185, వెల్లుల్లి 185. (కిలో.. రూ.లో).
- న్యూస్‌టుడే, పట్టాభిపురం

నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో నమోదైన అర్జీల్లోని సమస్యలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. జేసీ అధికారులతో సమీక్షిస్తూ.. అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించరాదన్నారు. పరిష్కారం సాధ్యం కాని అంశాలపై స్పష్టమైన కారణాలను అర్జీదారులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎన్.ఎస్.కె.ఖాజావలి, డ్వామా పీడీ శంకర్, డీఎంహెచ్ఓ విజయలక్ష్మి, డీపీవో సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ అశుతోష్ శ్రీవాస్తవ

మీరు కరుణిస్తేనే.. బాధలు తీరేది..

పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల వినతులు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే

ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రం గుంటూరులో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి... తమ బాధలు తీర్చాలని విన్నవించారు. సోమవారం కలెక్టరేట్‌లోని జిల్లా అధికారులను కలిసి... గోడు వెళ్లబోసుకున్నారు. ప్రత్యేకంగా దృష్టిసారించి... సమస్యలు తీర్చాలని వేడుకున్నారు.

రజక ఎస్సీ సాధన కమిటీ నాయకుల ఆవేదన

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి..

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ రజక ఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందించారు. నాయకులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే రాష్ట్ర మంత్రివర్గం తీర్మానం చేసి కేంద్రానికి నివేదిక పంపిందని చెప్పారు. 2014లో తెదేపా ఎన్నికల హామీలో ఈ అంశాన్ని పొందుపరిచిందని గుర్తుచేశారు. 2024 ఎన్నికలకు ముందు బీసీ డిక్లరేషన్‌లోనూ కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. దేశంలో 18 రాష్ట్రాల్లో, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో రజకులు ఎస్సీ జాబితాలో ఉన్నారని.. రాష్ట్రంలో మాత్రమే బీసీ జాబితాలో ఉన్నారని వివరించారు. ప్రభుత్వ హామీ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు జె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎండిపోతున్న పంటలను కాపాడాలి

దుగ్గిరాల మండలంలో సాగునీరు లేక ఎండిపోతున్న పంటలను కాపాడాలని కోరుతూ రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందించారు. రైతులు నష్టపోతున్నారని వివరించారు. హైలెవల్ కాలువ ద్వారా సక్రమంగా నీటిని అందించేలా జలవనరుల శాఖ ప్రణాళికలు రూపొందించాలి. నీటిని విడుదల చేయాలని కోరారు. నాయకులు కె.అజయ్‌కుమార్, ఈ.అప్పారావు, జె.బాలరాజు పాల్గొన్నారు.

మాకూ లబ్ధి చేకూర్చండి..

పట్టిచెరుకూరు గ్రామంలో నిషేధిత జాబితా నుంచి విముక్తి కలిగించిన ప్రభుత్వం... అదే ప్రాంతంలో 40 ఏళ్లుగా ఉంటున్న 42 కుటుంబాలను మాత్రం లబ్ధిదారుల జాబితాలో చేర్చలేదని బాధితులు వాపోయారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందించారు. విముక్తి లభించిన వారికి మంగళవారం పట్టాలు పంపిణీ చేయనున్న నేపథ్యంలో తమనూ జాబితాలో చేర్చాలని వారు కోరారు.

రోడ్డును కుదించి నిర్మిస్తున్నారు..

దుగ్గిరాల మండల రైతులు, నాయకులు

కృష్ణబాబుకాలనీ శివారు 21వ వార్డులోని శ్రీరామ చంద్ర కొష్టాల కాలనీలో ఏళ్లుగా కాలువలు లేవు. రోడ్డు నిర్మాణానికి అనుమతులు వచ్చి.. ఉన్న రోడ్డును కుదించి నిర్మిస్తున్నారు. కాలువలు లేక.. మురుగునీరు పారక.. అందరూ ఇబ్బంది పడుతున్నారు. 30 అడుగుల రోడ్డు ఉంటే కుదించి 14 అడుగులు మాత్రమే రోడ్డు నిర్మిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు, కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.
- కాలనీ అధ్యక్షుడు గణేష్, శివరావు, మల్లికార్జున్, రవి, చిట్టిబాబు, దుగ్గిరాల మండలం

మందులు తరలించిన వారిపై చర్యలు తీసుకోండి

ప్రభుత్వాసుపత్రి ఆవరణలోని మూడు జనరిక్ మెడికల్ దుకాణాల్లో జులై 28న తేదీ అర్ధరాత్రి వాహనాల్లో మందులు తరలించారు. దీనికి సంబంధించి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఉన్నా.. బెదిరించి మందులను తరలించారు. పోలీసు సిబ్బంది, ఇతర వ్యక్తులు దుకాణంలోకి ప్రవేశించి మందులు తీసుకెళ్లారు. అక్కడి సిబ్బందిని బెదిరించి, సీసీ కెమెరాలను తొలగించారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలి. తరలించిన మందులను అధికారుల సమక్షంలో లెక్కించి, ధ్రువీకరణ తర్వాత తిరిగి జనరిక్ దుకాణాలకు అప్పగించాలి.
- షేక్ షంషీర్, జనరిక్ మెడికల్ దుకాణం నిర్వాహకుడు

'కాంగ్రెస్ హడావుడి సరికాదు'

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే : భాజపా కార్యాలయంలో ఎవ్వరూ లేని సమయంలో అక్కడకు వచ్చి హడావుడి చేయడం సరికాదని భాజపా జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు అన్నారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నెలరోజుల కిందట జరిగిన ఘటనకు కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు హడావుడి చేయడం ఎంత వరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. ఇలాంటివి తగవని ఆయన పేర్కొన్నారు.

విచారణ వేగవంతం కావాలి సర్

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా జిల్లాలో 1.68 లక్షల మంది ఓటర్లకు నోటీసులను అందించారు. ఇందులో మ్యాపింగ్ కానీ ఓట్లతో పాటుగా ఓటరు పేరులో తప్పిదాలున్నా నోటీసులు జారీ అయ్యాయి. ఆదివారంతో ఓటర్లకు నోటీసులు అందించే ప్రక్రియ పూర్తికావడంతో సోమవారం నుంచి జిల్లాలో విచారణ ప్రక్రియ మరింత వేగవంతం అయ్యింది. సెప్టెంబరు 28వ తేదీలోగా విచారణ ప్రక్రియను పూర్తి చేయాలని ఈసీఐ ఆదేశాలున్నాయి. ఆ దిశగా ప్రక్రియను పూర్తి చేసేందుకు యంత్రాంగం కసరత్తు చేస్తోంది. మండలాలు, బీఎల్‌వో వారీగా విచారణ చేపడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లోనూ ఓటర్లు ముందుకొచ్చి నోటీసుల్లోని అభ్యంతరాలను సరిచేసుకుంటున్నారు. రెవెన్యూ యంత్రాంగంతో పాటు సర్ విధులు అప్పగించిన అధికారులంతా విచారణ ప్రక్రియలో నిమగ్నమయ్యారు.

సంచార జాతుల అభ్యున్నతికి కృషి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే : సంచార జాతుల అభ్యున్నతికి కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ కృషి చేస్తున్నారని భాజపా జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు అన్నారు. సంచార జాతుల విముక్తి దినోత్సవం సందర్భంగా సోమవారం లిబర్టీ సెంటర్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. సంచార జాతుల్లోని అనేక కుటుంబాలకు ఆధార్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి ఆయా పత్రాలను అందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలపాటి రవికుమార్, జాతీయ స్పైసెస్ బోర్డు డైరెక్టర్ కొత్తూరు వెంకట సుబ్బారావు, భాజపా రాష్ట్ర ఐటీసెల్ కన్వీనర్ మకుటం శివ, బ్రాహ్మణ సంక్షేమ సంస్థ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ మాట్లాడారు. సభలో మిర్చియార్డు డైరెక్టర్ శ్రావణకుమారి, నాయకులు పావని, భజరంగ్ రామకృష్ణ, తదితర నాయకులు పాల్గొన్నారు.

అవినీతికి తావులేకుండా పింఛన్ల పంపిణీ

జిల్లా పరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే : ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లకు సంబంధించి ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చేలా చూడాలని జిల్లా పరిషత్తు సీఈవో వి.జ్యోతిబసు అన్నారు. సోమవారం ఆయన జడ్పీ కార్యాలయం నుంచి డీఆర్‌డీఏ పీడీ, డీపీవో, ఎంపీడీవోలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. అధికారులు సెప్టెంబరు 1న లబ్ధిదారుల గృహాలకు వెళ్లి పింఛను నగదు అందజేయాలని చెప్పారు. అవినీతికి తావులేకుండా, లబ్ధిదారులతో మర్యాదగా వ్యవహరించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవీఆర్ఎస్ సర్వేలో పింఛన్ల పంపిణీలో సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారా? ఇంటి వద్దనే ఇస్తున్నారా? మర్యాదగా వ్యవహరిస్తున్నారా? అనే మూడు ప్రశ్నలు అడిగి ప్రజల స్పందన అడుగుతారన్నారు. ప్రజలతో గౌరవంగా మాట్లాడాలని స్పష్టం చేశారు. పంపిణీలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని సూచించారు. డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ.. మేడికొండూరు, ఫిరంగిపురం, తాడికొండ, తుళ్లూరు, పొన్నూరు మండలాల్లో అధికారుల పనితీరుపై ఎంపీడీవోలు పర్యవేక్షించాలని సూచించారు. ప్రజా సానుకూల స్పందన (పీపీపీ) సర్వేలో సేవలపై సంతృప్తి శాతం పెరగడం కన్నా వ్యతిరేకత రావడంపై అధికారులు దృష్టిసారించాలని కోరారు. డీపీవో బి.వి.నాగసాయికుమార్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు తెప్పించుకుంటున్నామని వివరించారు.

3 నుంచి ఓటర్ల జాబితాపై గ్రామ సభలు

మాట్లాడుతున్న కలెక్టర్ సాయికాంత్ వర్మ

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఈ నెల 3 నుంచి 6 వరకు గ్రామ సభలు నిర్వహించాలని కలెక్టర్ సి.యం.సాయికాంత్‌వర్మ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల తుది ప్రచురణ చేశామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఓటర్లకు సంబంధించి అభ్యంతరాలుంటే సెప్టెంబరు 2వ తేదీలోగా విచారణ పూర్తి చేయాలని సూచించారు. గ్రామ సభల నిర్వహణకు ప్రత్యేక అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల పట్ల ప్రజల సంతృప్తి పెరగాలని, సేవలు అందించడంలో అధికారులు, సిబ్బంది శ్రద్ధ వహించాలని సూచించారు. శాఖల వారీగా సేవలు, లోపాలు గుర్తించి వాటిని సరిదిద్దుకోవాలన్నారు. పట్టణ భూపరిమితి చట్టం కింద ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జేసీ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్‌లో భాగంగా 75శాతం వరకు విచారణ పూర్తయ్యిందని, మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లో ఈ ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని సూచించారు. అభ్యంతరాలను బీఎల్‌వోల వారీగా విచారణ చేపట్టాలన్నారు. సమావేశంలో నగర కమిషనర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో ఎన్.ఎస్.కె.ఖాజావలి, జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, సీపీవో శేషశ్రీ, డీపీవో బి.వి.నాగసాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు

శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

పట్టాభిపురం, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వ నిధులు, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పాటు సీఎస్ఆర్ నిధుల్ని సద్వినియోగం చేసుకుంటూ నగరంలో అభివృద్ధి పనులు చేస్తున్నామని కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. విద్యార్థినులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు రూ.1.98 కోట్ల సీఎస్ఆర్ నిధులతో అదనపు తరగతి గదుల భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. సోమవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదుల భవన నిర్మాణానికి ఆయన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. పెమ్మసాని మాట్లాడుతూ.. 1942లో స్థాపించిన ఈ కళాశాలకు ఎంతో ఘనమైన చరిత్ర ఉందన్నారు. ప్రస్తుతం 2500 మందికి పైగా పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థినులు చదువుకుంటున్నారని చెప్పారు. వీరికి తరగతి గదులు సరిపోకపోవడంతో అదనంగా 12 తరగతి గదులు అవసరమని ప్రిన్సిపల్ జ్యోత్స్న కుమారి కోరినట్లు తెలిపారు. దీనికోసం కోల్ ఇండియా నుంచి రూ.2 కోట్ల సీఎస్ఆర్ నిధుల్ని సమీకరించామన్నారు. వేగంగా పనులు పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం నాటికి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని వివరించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విద్యార్థుల సమస్యల్ని గాలికి వదిలేసిందని విమర్శించారు. మంత్రి నారా లోకేశ్ విద్యా వ్యవస్థను గాడిలో పెడ్తూ విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్, మాజీ డిప్యూటీ మేయర్ షేక్ షజీల, పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

పనులపై పర్యవేక్షణ ఏదీ?

గుంటూరు నగరం, న్యూస్‌టుడే :

ఉద్యోగనగర్‌లో పునాదుల దశలోనే..

అంకమ్మనగర్‌లో స్లాబ్ దశకు వచ్చిన ట్యాంకు

నగర ప్రజలకు సరిపడా తాగునీరు అందించేందుకు పలు ప్రాంతాల్లో రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టారు. జీఎంసీ ఆధ్వర్యంలో చేస్తున్న ఎలివేటెడ్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్ల(ఈఎల్ఎస్ఆర్) పనులపై ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. పశ్చిమ నియోజకవర్గం పరిధిలో ఉద్యోగనగర్, అంకమ్మనగర్‌లలో.. ఆయా పనులకు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే గళ్లా మాధవిలు గతేడాది డిసెంబరు 21న శంకుస్థాపన చేశారు. రెండింటికీ ఒకే రోజున శంకుస్థాపన చేశారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో.. ఉద్యోగనగర్ రిజర్వాయర్ పనులు పునాదుల దశ దాటలేదు. అంకమ్మనగర్‌లో శ్లాబ్ దశకు చేరుకున్నాయి. సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం, ఉద్యానవనం అభివృద్ధిపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా.. ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని ఉద్యోగనగర్‌వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తీగలతో తప్పని ఇబ్బందులు

కొన్ని నెట్ కేబుల్ తీగలను విద్యుత్తు స్తంభాలకు కడుతున్నారు. చుట్టలుగా పెట్టి వదిలేయడం, మరమ్మతుల సమయంలో కట్‌చేసి అక్కడే వదిలేయడం వల్ల చెల్లాచెదురుగా పడిపోతున్నాయి. వాటిని తొలగించకుండా అక్కడే వదిలేసి వెళ్లిపోవడంతో వాహనాల టైర్లకు చుట్టుకుంటున్నాయి. ప్రమాదాలబారిన పడుతున్నామని చోదకులు వాపోతున్నారు. కృష్ణనగర్ ఏడోలైను ఫారెస్ట్ కాలనీలో ఇదే పరిస్థితులు నెలకొనడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.
- న్యూస్‌టుడే, పట్టాభిపురం

'బీసీల ఎదుగుదలను అడ్డుకుంటున్న జగన్'

పట్నంబజారు, న్యూస్‌టుడే : బీసీలను రాజకీయంగా ఎదగనీయకుండా వై.ఎస్.జగన్ అడ్డుకుంటున్నారని జాతీయ బీసీ బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కూటమి ప్రభుత్వం చెప్పగా.. రాజకీయ కుట్రలో భాగంగా వైకాపా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిందన్నారు. స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు ఆ పార్టీ నేతలు చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించటం ద్వారా 16,800 మందికి అన్యాయం జరిగిందన్నారు.

బీఎస్సీ నర్సింగ్ సీట్ల పెంపు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే : స్థానిక తారకరామనగర్‌లోని మాదాల శకుంతల భాస్కర్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ సీట్ల సంఖ్యను 50 నుంచి 60కి పెంచారు. ఈ మేరకు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి జి.వీరపాండ్యన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

70th వార్షికోత్సవ శుభాకాంక్షలు
LIC
भारतीय जीवन बीमा निगम
LIFE INSURANCE CORPORATION OF INDIA
జీవిత బీమా | పొదుపు | భరోసా | సురక్షిత భవిష్యత్తు
ఖాతాదారులకు, విశిష్ట సేవలందిస్తున్న ఎల్.ఐ.సి. ఆఫ్ ఇండియా నేడు 70 వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భముగా శుభాకాంక్షలతో...
వై.ధన్వంతరావు, M.Com., MDRT., USA., LIC Agent
CODE No.: 1062699, గుంటూరు CB-2 బ్రాంచి, Member Corporate Club
OFFICE : Dhanam Insurance Point, 13/1 Arundelpet, GUNTUR-2. Ph.: 94407 97679, 93468 78037

సమీక్షా సమావేశంలో ప్రశ్నల వర్షం

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని స్వర్ణోత్సవాలలో భాగంగా బుధవారం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఉన్నతాధికారులు కమిటీలు నియమించారు. ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ అధ్యక్షతన సోమవారం కమిటీలతో సమీక్షా సమావేశం జరిగింది. రెండు రోజుల్లో సమావేశం నిర్వహిస్తుండగా ఇప్పుడు సమీక్ష ఏమిటని పలువురు సభ్యులు ప్రశ్నించారు. పూర్వ విద్యార్థుల కోసం నిర్వహించే ఈ సమావేశంలో వాళ్లను ఎందుకు నియమించలేదని నిలదీశారు. స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలలో కొంతమందికే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపణలు చేశారు. సీనియర్ ఆచార్యులు ఒకరు తనకు కమిటీలో ఎందుకు స్థానం కల్పించలేదని ప్రశ్నించారు. పూర్వ విద్యార్థుల సమావేశానికి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఎందుకు నియమించలేదని నిలదీశారు. పూర్వ విద్యార్థుల సమావేశం కోసం ఆయా విభాగాలకు కేటాయించిన డబ్బులు ఇంకా అందలేదని తెలిపారు. అన్ని విభాగాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదని, పూర్వ విద్యార్థులు వచ్చే సమయంలో ఇలా ఉంటే ఎలా అని అడిగారు.

కుటుంబ పింఛనుకు ఎదురుచూపులు

రహమతున్నిసా బేగం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే : ఖజానా శాఖలో ఎస్టీఓగా పనిచేస్తూ ఎం.డి.అన్వరుల్లా బేగ్ పదవీ విరమణ పొందారు. తర్వాత కొద్దికాలానికే ఆయన మరణించగా.. రహమతున్నిసాబేగంకు కుటుంబ పింఛను వస్తుంది. 2007లో అనారోగ్య సమస్యలతో ఉన్న ఆమె.. లైఫ్ సర్టిఫికెట్ సమర్పించకపోవడంతో కుటుంబ పింఛను నిలిచిపోయింది. అప్పటి నుంచి కుటుంబ సభ్యుల సాయంతో ఆమె జిల్లా, రాష్ట్ర స్థాయిలో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పింఛను పునరుద్ధరణ కాలేదని వాపోయారు. గతంలో పీజీఆర్ఎస్‌లో అర్జీ అందించినా పరిష్కారం కాలేదు. 87 సంవత్సరాల వయసులో కుటుంబ పింఛను ఇప్పించాలని కోరుతూ ఆమె సోమవారం పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందించేందుకు కలెక్టరేట్‌కు వచ్చారు. అధికారులు స్పందించి తనకు రావాల్సిన పింఛను బకాయిలు అందించాలని కోరారు.

పోలీసు సిబ్బంది సేవలు ప్రశంసనీయం

గుంటూరు నేరవార్తలు: పోలీసుశాఖలో సుదీర్ఘకాలం పని చేసిన ఎస్సై రవికుమార్, ఏఎస్సై శివరామ బాపయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం పోలీసు కార్యాలయంలో ఎస్పీ వకుల్‌జిందాల్ సన్మానించి వారి సేవలు ప్రశంసించారు. డీఎస్పీలు అళహరి శ్రీనివాస్, సుంకరయ్య, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, కృష్ణయ్య, పోలీసు అధికారుల సంఘం నాయకులు సాంబశివరావు, లక్ష్మయ్య, రాష్ట్ర మాజీ అధ్యక్షులు దళవాయి సుబ్రహ్మణ్యం, పీఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన రహదారుల విస్తరణ పనులు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: బృందావన్‌గార్డెన్స్ రహదారి విస్తరణలో మిగిలిన పనులను పది రోజుల్లో పూర్తి చేసి సెంటర్ డివైడర్ నిర్మాణ పనులు ప్రారంభించాలని కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశించారు. సోమవారం కమిషనర్ ఛాంబర్‌లో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ఏపీ సీపీడీసీఎల్ అధికారులతో రహదారుల విస్తరణ పనుల పురోగతిపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ బృందావన్‌గార్డెన్స్ కూడలి నుంచి హనుమయ్య కంపెనీ వరకు రహదారి విస్తరణ పనులు అన్ని విభాగాల సమన్వయంతో యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఏపీయూఐఎంఎల్ ప్రతినిధులతో కలిసి పనిచేయాలన్నారు. భవన యజమానులతో మాట్లాడి, నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందజేసి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. చుట్టుగుంట వద్ద చంద్రబానుకుంట రోడ్డు విస్తరణ మ్యాప్‌లను పరిశీలించి, త్వరితగతిన రహదారి విస్తరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సీపీ రాంబాబు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఏసీపీ రెహమాన్, డీఈఈ వెంకటరమణ, విద్యుత్తు శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్లాను పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ మయూర్ అశోక్

శ్రద్ధాంజలి
మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించి ఆకస్మికంగా మమ్మల్ని వీడి దైవ సన్నిధికి చేరిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..
కీ॥శే॥ కొత్తపల్లి వెంకటరత్నం గారు
జననం: 25-06-1936 మరణం: 23-08-2026
Asst. Director (Retd) NCC Dept, Govt. Of AP.
D-62, SVN కాలనీ, 8వ లైన్, గుంటూరు
కుమార్తె: లక్ష్మీపద్మలత - అల్లుడు: రాధాకృష్ణమూర్తి
కుమారులు: మురళీమాధవ్ - కోడళ్ళు: పద్మావతి
వేణు మాధవ్ - సుజాతాదేవి
శ్రీనివాస్‌మాధవ్ - హేమలత
మనవలు, మనవరాళ్లు, మునిమనుమడు, మునిమనుమరాళ్లు
కార్యస్థలము: ది. 2-09-26 బుధవారం ఉ॥ 11.30 ని॥లకు హోటల్ వెంకటేష్ గ్రాండ్ SVN కాలనీ, మెయిన్ రోడ్డు, గుజ్జనగుండ్ల, గుంటూరులో జరుగును. Ph: 8074634911

ORDER 21 RULE 66 NOTICE
IN THE COURT OF THE III ADDL. DIST.JUDGE:: GUNTUR
E.P. No. 15/2024 in OS. No. 70/2018
Between:
M/s.Gowra leasing and Finance Ltd, Rep. by it's recovery officer, Dayakar Ragiri. ...D.Hr.
And
M/s.Global Tours and Travels, Rep.by it's Prop. Shri Chimmula Ravinder Reddy and Another. ...J.Dr's
To,
JDR-2:Shri Chimmula Ravinder Reddy, S/o.Shri Lakxma Reddy, R/o.Flat No.F-3, F-Block, 'Riviera Suites', Old Municipal Door No.4-20-33, 4th Lane Navabharath Nagar, Guntur-522007.
పై నెంబరు అమలు పిటీషనులో 2వ జె.డి.ఆర్. అయిన మీకు పై కోర్టు వారి నుండి ఎన్ని సార్లు నోటీసులు పంపించినను మీరు బుద్ధి పూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు నోటీసు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియ జేయమని ది.15-09-2026 నకు వాయిదావేసినారు. కావున వాయిదారోజు ఉ.గం. 10-30ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును. (శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
వాయిదా తేది:15-09-2026
మట్టుపల్లి వెంకట సుబ్బారావు, డి.హెచ్.ఆర్. తరపు అడ్వకేటు, అరండల్‌పేట 9వ లైను, గుంటూరు. సెల్: 9849512277

అడ్డదిడ్డంగా రాకపోకలు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే : నగరంలో డ్రెయిన్ల నిర్మాణాల కోసం జీఎంసీ అధికారులు ఇళ్ల ముందు సరిహద్దుల్లో గుంతలు తీస్తున్నారు. అరండల్‌పేట ఐదో లైన్‌లో వాహనాలు రాకపోకలు జరగకుండా తాడు కట్టడంతో 17వ లైన్ నుంచి ఆరో లైన్ మొదటి అడ్డరోడ్డు వరకు వచ్చిన ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు తాకిడితో రద్దీ ఏర్పడింది. అరండల్‌పేట 4వ వీధి రెండో అడ్డరోడ్డు నుంచి వచ్చిన వాహనాలు ఎదురెదురవడంతో వెళ్లేందుకు దారి లేదు. సాయిభాస్కర్ ఆస్పత్రి వద్ద చాలా సేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. శంకర్‌విలాస్ వంతెన విస్తరణ పనులతో నగరంలో ట్రాఫిక్‌ను మళ్లించడంతో వీధుల్లో రోజూ వాహనాల రద్దీతో ఇబ్బందులు పడుతున్నారు. జీఎంసీ అధికారులు ఇప్పుడే డ్రెయిన్ల నిర్మాణాల కోసం రోడ్లు తవ్వడంతో కష్టాలు రెట్టింపయ్యాయి. ప్రణాళిక ప్రకారం సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

'హమారా ప్రసాద్‌పై కేసు నమోదు చేయాలి'

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను కించపరిచేలా తప్పుడు ప్రచారం చేస్తున్న హమారా ప్రసాద్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలని అంబేడ్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వద్దిముక్కల సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం లాడ్జికూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అంబేడ్కర్‌పై మొదటి నుంచి మనువాద శక్తులు వివిధ రూపాల్లో దాడులు చేస్తున్నాయన్నారు. ఆయన్ని కించపరిచేలా ప్రచారం చేస్తున్న ప్రసాద్‌పై కేసు నమోదు చేయాలని కోరారు. దళిత మహాసభ నాయకుడు యంద్రపాటి సాంబశివరావు, బహుజన డెమొక్రటిక్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డెన్నిస్‌రాయ్, నాయకులు నల్లపు నీలాంబరం, విలియం డేవిడ్స్, బత్తుల అనీల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమానికి చేయూత

పట్టాభిపురం, న్యూస్‌టుడే : కాకతీయ కన్వెన్షన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బాలుర వసతి గృహం అభివృద్ధి, సంక్షేమానికి కమ్మజన సేవా సమితి లైఫ్ టైమ్ ఛైర్మన్, ప్రవాసాంధ్రులు నూతక్కి రామకృష్ణ ప్రసాద్ రూ.5 లక్షలు విరాళం అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కును కేఐసీసీ కార్యదర్శి ఘంటా పున్నారావుకు ఇచ్చారు. ప్రవాసాంధ్రులు కొడాలి చంద్రమౌళీ, కొడాలి వెంకట రాజేశ్వరి పేద విద్యార్థినుల విద్యాభ్యాసం, ఉపకారవేతనాలకు రూ.లక్ష విరాళం అందజేశారు. పువ్వాడ కాశీ విశ్వేశ్వరరావు ద్వారా అందించారు. కమ్మజన సేవా సమితి అధ్యక్షులు మల్లెల హరీంద్రనాథ్ చౌదరి, సభ్యులు దండా బ్రహ్మానందం, రావెల సత్యనారాయణ, కొర్రపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

పున్నారావుకు చెక్కు అందజేస్తున్న రామకృష్ణ ప్రసాద్ తదితరులు

అంతిమయాత్ర
గుంటూరు JKC కాలేజి రిటైర్డ్ ప్రిన్సిపల్ కీ॥శే॥ ఈదర భాస్కరరావు గారి సతీమణి
శ్రీమతి ఈదర శేరాక్షరి గారు
ది. 29-08-2026 శనివారం పరమపదించారు.
అంత్యక్రియలు : ది. 01-09-2026 మంగళవారం (ఈ రోజు) ఉదయం 10 గంటలకు తెనాలి ఐతానగర్‌లోని మా స్వగృహము నుండి "అంతిమయాత్ర" బయలుదేరును. కావున తెలియపరచడమైనది.
ఇట్లు : డా॥ ఈదర లోకేశ్వరరావు, ఈదర నిరంజనరావు మరియు కుటుంబసభ్యులు Cell : 7416002904

(c) eenadu